Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 292 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 నవంబర్ 2023 శుక్రవారం

## పాక్ సంక్షోభం.. కనిష్ఠ స్థాయికి పడిపోయిన రూపాయి

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేం దుకు వీలుగా అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి రుణాలు పొం దేందుకు పాక్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తాజా పాకిస్థాన్ రూపా యి మారకపు రేటుపై నిబంధనను సరళతరం చేసింది. దీంతో డాలరుతో పాక్ రూపాయి మారకపు విలువ 255కి పడిపోయింది. పాక్ చరిత్రలో ఇంత పెద్దమొత్తంలో రూపాయి పతనం కావడం ఇదే తొలిసారి. ఐఎంఎఫ్ సూచన మేరకు పాకిస్థాన్ ద్రవ్యమారకపు రేటుపై నిబంధనలను సడలించింది. దీంతో ఒక్క రోజులోనే పాక్ రూపాయి రూ. 24 మేర క్షీణించినట్లు ట్రిబ్యూన్ వెల్లడించింది. రూపాయిపై పాక్ ప్రభుత్వం నియంత్రణలను సరళీకరించాలని, రూపాయి మారకపు విలువను మార్కెట్ నిర్ణయించేలా చూడాలని ఐఎంఎఫ్ పాకిస్థాన్‌ను కోరింది.




# ఎందుకొస్తున్నాడో కామారెడ్డికి

# 'ఓటుకు కోట్లు' ముద్దాయి!

## నామినేషన్ వేశాక రేవంత్ రెడ్డిని కేసీఆర్ ఏమన్నారో చూడండి..

కామారెడ్డి ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై తెలంగాణ సీఎం, గులాబీ బాస్ కల్వకుంట్ల చంద్రశేఖరరావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ వచ్చిన కొద్దిరోజుల్లోనే రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయాలని.. రాజకీయ అస్థిరత తెచ్చేందుకు కొందరు ప్రయత్నాలు చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యేను కొనేందుకు వచ్చి రూ. 50 లక్షలతో పట్టుబడిన 'మహాత్ముడు' కామారెడ్డిలో తనపై పోటీచేస్తున్నాడని చెప్పుకొచ్చారు. దీనిపై కామారెడ్డి ప్రజలు ఆలోచించుకోవాలని.. వారికి తగిన బుద్ధి చెప్పే బాధ్యత నియోజకవర్గ ప్రజలపై ఉందని పిలుపునిచ్చారు. కాగా.. అంతకుముందు కామారెడ్డి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ నామినేషన్ దాఖలు చేశారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో కేసీఆర్ నామినేషన్ వేశారు. రెండు సెట్ల నామినేషన్‌లు కేసీఆర్ దాఖలు చేశారు. అనంతరం అక్కడి నుంచి కామారెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం పాల్గొన్నారు.

**కామారెడ్డి నుంచే ఎందుకు..?** ' కామారెడ్డితో నాకు విడదీయలేని అనుబంధం ఉంది. మా అమ్మ వాళ్లది కోనాపూర్.. జలసాధన ఉద్యమం చేసినపుడు కామారెడ్డి మండల బ్రిగేడియర్‌గా పని చేశాను. గులాబీ కూలీ చేసి బీడీ ఫ్యాక్టరీలో పని చేశాను. తెలంగాణ ఉద్యమం ప్రారంభంలో ఏకగ్రీవ తీర్మానం చేసింది కామారెడ్డి బార్ అసోసియేషన్. గత ఎన్నికల్లో కామారెడ్డిని జిల్లా చేస్తామని హామీ ఇచ్చాను.. చేశాను. నన్ను కామారెడ్డి నేతలు కోరడంతో ఇక్కడ పోటీ చేస్తున్నాను. కేసీఆర్ వెంబడి చాలా వస్తాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు నీరు పారించే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తానని హామీ ఇస్తున్నాను. కామారెడ్డి పట్టణంతో పాటు పల్లెల రూపు రేఖలు మారుతాయి' అని నియోజకవర్గంపై కేసీఆర్ వరాల వర్షం కురిపించారు.

**విచక్షణతో ఓటేయండి..!** 'ఎన్నికల్లో పార్టీకి ఒకరు నిలబడతారు. వ్యక్తుల గురించి ఆలోచించాలి.. దానికి మించి అతని వెనుకున్న పార్టీని చూడాలి. ఎవరో చెప్పారని ఓటు వేయొద్దు.. విచక్షణతో వేయాలి. ఎన్నికల్లో ప్రజలు గెలిచే పరిణితి రావాలి. 1956 దాకా మనతో ఉన్న తెలంగాణను మనకు కాకుండా చేసింది కాంగ్రెస్ పార్టీ. ప్రజలంతా చరిత్ర తెలుసుకోవాలి. ఒక్క తెలంగాణలో తప్ప ఏ ఇతర రాష్ట్రంలో బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వడం లేదు. కొత్తగా వచ్చిన బీడీ కార్మికులందరికీ పెన్షన్ ఇస్తాం. సమైక్య రాష్ట్రంలో వ్యవసాయం నాశనం చేశారు. ఉత్తమ్ కుమార్ రైతుబంధు దుబారా అంటున్నాడు. ప్రధాని మోదీ నియోజకవర్గంలో కూడా 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. రైతుల మోటర్లకు మీటర్లు పెట్టకపోతే మన నిధులకు కోత పెట్టారు. ఇది బీజేపీ నేతలను అడగండి. తెలంగాణపై పగబట్టిన బీజేపీకి ఒక్క ఓటు కూడా వేయొద్దు' అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

**నేను చూసుకుంటా..!** '50 లక్షలతో పట్టుబడిన వ్యక్తినే నామీద పోటీకి వచ్చిండు. ఎలా బుద్ధి చెప్పాలో మీరు నిర్ణయించుకోండి. మేము అధికారంలోకి వచ్చాక కర్ఫ్యూ లేదు, కల్లోలం లేదు.. కరువూ లేదు. కామారెడ్డి కి ఐటీ రంగం వస్తుంది. కామారెడ్డి నియోజకవర్గాన్ని బంగారు తునకలాగా చేసి మీకు అప్పగిస్తాను. గంప గోవర్ధన్ పదవి త్యాగం చేసి నాకు ఇచ్చారు. గోవర్ధన్ రాజకీయ భవిష్యత్తు సేఫ్‌గా కాపాడుతాను. ఆయన మంచి స్థాయిలో ఉంటారు' అని కేసీఆర్ చెప్పుకొచ్చారు. మరోవైపు.. సమావేశానికి ముందు కామారెడ్డి బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ విప్ గంప నివాసంలో సీఎం సమావేశమయ్యారు. గ్రూప్ తగాదాలు వీడి కలిసి కట్టుగా పని చేయాలని హెచ్చరించారు. ఇటీవల జరిగిన పార్టీ పరిణామాల నేపథ్యంలో పార్టీ నేతలపై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రజా ఆశీర్వాద సభకు వెళ్లిన కేసీఆర్ పైవిధంగా ప్రసంగం చేశారు.

# 'పోలింగ్ డే'ను దెబ్బేయనున్న లాంగ్ వీకెండ్?




హైదరాబాద్ : గత ఎన్నికలతో పోలిస్తే.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై రెండు వారాలకు పైనే జరిగినా.. రాజకీయ వేడి అంతగా రాజుకున్నది లేదు. దీనికి కారణం.. అధికార పార్టీ మినహా మిగిలిన రెండు ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల్ని డిసైడ్ చేయకపోవటమే. అధికార బీఆర్ఎస్ మినహా కాంగ్రెస్.. బీజేపీలు రెండు తమ అభ్యర్థుల జాబితాలో తొలి భాగాన్ని విడుదల చేసినా.. అందులో కీలక స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల్ని ఫైనల్ చేయలేదు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్.. బీజేపీలు దాదాపు డెబ్భై వరకు స్థానాల్ని ప్రకటించాల్సి ఉంది. దీంతో.. అభ్యర్థులు ఎవరో ఫైనల్ కాక కిందా మీదా పడుతున్న పరిస్థితి. ఇదిలా ఉంటే.. ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ డేకు సంబంధించిన ఒక కొత్త చర్చ రాజకీయ పార్టీలకు టెన్షన్ పుట్టిస్తోంది. నవంబరు 30న పోలింగ్ డే. రోజుల్లో చూస్తే గురువారం వచ్చింది. పోలింగ్ రోజున పబ్లిక్ హాలీడే కావటం...శుక్రవారం ఒక్కరోజు సెలవు పెడితే.. ఎంచక్కా లాంగ్ వీకెండ్ ఎంజాయ్ చేయొచ్చన్న మాట వినిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే అర్బన్ ప్రాంతాలు.. అందునా హైదరాబాద్ మహానగరం లాంటి చోట్ల లాంగ్ వీకెండ్ ఎఫెక్టు ఎక్కువగా ఉండే వీలుందంటున్నారు. ఓటర్లలో నిరాకస్తత.. రాజకీయాల్ని తాము ప్రభావితం చేయలేమన్న ఫీలింగ్.. రాజకీయాలంటే వెగటు.. ఇలాంటి భావనలు ఓటు వేసేందుకు క్యూలో నిలుచునే కన్నా.. ఆ టైంలో ఎంచక్కా ఎక్కడికైనా బయటకు ప్లాన్ చేయటం పైనే కొన్ని వర్గాలు ఫోకస్ చేస్తుంటాయి. ఈసారి లాంగ్ వీకెండ్ లో వస్తున్న పోలింగ్ డే.. పోలింగ్ మీద ప్రభావాన్ని చూపిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2018 ఎన్నికలతో పోలిస్తే తాజాగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లోని నియోజకవర్గాలతో పోలిస్తే.. పట్టణం.. నగర ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరుగుదల కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇలాంటి వేళ.. పట్టణ.. నగర ప్రాంతాలకు చెందిన ఓటర్లు పోలింగ్ డేను లాంగ్ వీకెండ్ గా భావించి.. ట్రిప్ కు ప్లాన్ చేస్తే మాత్రం.. దాని ఎఫెక్టు పోలింగ్ మీద ప్రభావం చూపుతుందని చెప్పక తప్పదు. ఎవరు అవునన్నా.. కాదన్నా.. మన దేశంలో రాజకీయాలు మాత్రమే ప్రజల తలరాతల్ని మార్చటంతో పాటు.. జీవితాలను ప్రభావితం చేస్తుంటాయి. నిత్యం ఏదో అంశం మీద తిట్టుకునే ప్రజలు.. పాలకులుగా ఎవరు ఉండాలన్న అవకాశం తమ చేతికి వచ్చిన రోజును.. అల్ప ఆనందాల కోసం ట్రిప్పులకు ప్లాన్ చేయకుండా.. అందుకు భిన్నంగా ప్లాన్ చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ఏ చిన్న తేడా చేసినా.. మన భవితను మనమే చెడగొట్టుకున్నట్లు అవుతుందన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది.

## నేను జైలుకెళ్లడానికి ఎర్రబెల్లి దయాకర్ రావే కారణం: రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్, బీజేపీలపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాను జైలుకెళ్లడానికి ఎర్రబెల్లి దయాకర్ రావే కారణమనిమండిపడ్డారు. కాంగ్రెస్ నేతల ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడుల నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఐటీ దాడులకు కాంగ్రెస్ భయపడేది లేదన్నారు. పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఐటీ అధికారులు పెద్దఎత్తున దాడులు చేస్తూ భయపెట్టాలని చూస్తున్నారన్నారు. ఇది బీఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న రాజకీయ కుట్రగా అభి వర్ణించారు. ఇలాంటి రాజకీయ బెదిరింపులకు కాంగ్రెస్ నాయకులు భయపడబోరని తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్ర కాంగ్రెస్ అంతా అండగా ఉంటుందన్నారు. ఓటమి భయంతోనే బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్ర రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకులను ఐటీ టార్గెట్‌గా చేసుకొని దా డులు చేస్తోందన్నారు. గత వారం రోజుల నుంచి కాంగ్రెస్ నాయకుల ఇళ్లల్లో మాత్రమే ఐటీ దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు.
వచ్చే ఎన్నికలలో ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రలోభాలు పెట్టేందుకు

# 'కట్టలు' తెంచుకుంటున్నాయి...!




## రూ. 520 కోట్ల రూపాయలు సీజ్ చేసిన పోలీసులు

హైదరాబాద్ : ఎన్నికలంటేనే డబ్బులు వెదచల్లటం అన్నట్లుగా అయిపోయింది. ఒకప్పుడు ఎన్నికల్లో డబ్బు ప్రవాహం మాత్రమే ఉండేది. గడచిన రెండు ఎన్నికల్లో డబ్బుతో పాటు మద్యం, బంగారంతో పాటు ఇతర ప్రలోభాలు కూడా ఎక్కువైపోతున్నాయి. దీనికి తెలంగాణా ఎన్నికలే ఉదాహరణ. పోయిన నెల 9వ తేదీ నుండి మంగళవారం అంటే నవంబర్ 7వ తేదీ వరకు లెక్క తీసుకుంటే సుమారు రు. 520 కోట్లు పోలీసులు సీజ్ చేశారు.

ఇందులో డబ్బు, మద్యం, బంగారం, వెండి, క్రీడా సామగ్రి, ఖరీదైన షూస్, కుక్కర్లు, బట్టలున్నాయి. పైన దొరికినవాటికి అదనంగా మరోటి కూడా పోలీసులకు దొరికింది.

అదేమిటంటే మాదక ద్రవ్యాలు కూడా పట్టుబడటమే పోలీసులను ఆందోళనకు గురిచేస్తోంది. పోలీసులు ఎంతగా ప్రయత్నాలు చేస్తున్నా పట్టుబడేవి పట్టుబడుతున్నాయి, ఇతర మార్గాల్లో తప్పించుకునేవి తప్పించుకుంటునే ఉన్నాయి. పార్టీల నేతలు అనేక మార్గాల్లో యథేచ్ఛగా డబ్బు, మద్యం, బంగారం, వెండి, వజ్రాలు, కుక్కర్లు తదితరాలను రవాణా చేస్తునే ఉన్నారు. తెలంగాణాకు చుట్టుపక్కల మహారాష్ట్ర, ఏపీ, కర్నాటక, ఛత్తీస్ ఘడ్, ఒడిస్సా సరిహద్దులుండటంతో నిఘావేయటం ప్రాక్టికల్ గా సాధ్యంకావటం లేదు. తెలంగాణాలోని కొన్ని జిల్లాల్లో మావోయిస్టుల సంచారం ఎక్కువగా ఉందని ఇంటెలిజెన్స్ సమాచారం ఉంది. అందుకనే ఆ ప్రాంతాల్లో ప్రత్యేక దళాలు గాలింపు చర్యలు చేస్తున్నాయి. వీళ్ళకి తోడుగా లోకల్ పోలీసులు కూడా అడవుల్లో తిరుగుతున్నారు. ఇలాంటి జిల్లాల్లో ఎన్నికల విధుల్లో పోలీసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. అన్నీ పార్టీలకు ఇదే అదునుగా మారిపోయింది. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే పట్టుబడిందే రు. 500 కోట్లంటే ఇక యథేచ్ఛగా జనాల చేతుల్లోకి వెళ్ళిపోయింది ఇంకెంత ఉండుంటుంది ? ఓటర్లను ప్రలోభాలకు గురిచేయటంలో ఈ పార్టీ ఆ పార్టీ అన్న తేడా లేదు. ఏ పార్టీ తెలివిగా వ్యవహరిస్తుందో ఆ పార్టీ అభ్యర్థులు యథేచ్ఛగా తమ టార్గెట్లను రీచవగలుగుతున్నారు. ఇందులో అధికారపార్టీకి ఎక్కువ అవకాశాలు ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. పోలీసులు ఎన్నికల కమీషన్ పరిధిలో పనిచేస్తున్నా ఎన్నికల విధుల్లో ఉండేవారు మాత్రమే కమీషన్ పరిధిలో ఉంటారు మిగిలిన వారు ?

## సంపాదకీయం

# ఆ ఫైర్ ఏమైంది పవన్....?

ఏపీలో కనిపించిన ఆవేశం వేడి వాడి తెలంగాణాలో జరిగిన పవన్ ఎన్నికల తొలి సభలో కనిపించలేదని అంటున్నారు. పవన్ కళ్యాణ్ స్పీచ్ అంటే ఆవేశం పరవళ్ళు తొక్కుతుంది. ఆయన పాలకులను తనదైన మాటలతో చెలగాటమాడతారు. వైసీపీ మీద పవన్ తీవ్ర స్థాయిలో చేసిన విమర్శలు అందరికీ చెవులలో ఇప్పటికీ ఉంటాయి. అలాంటి పవన్ తెలంగాణా సభలో మాత్రం చాలా స్మూత్ గా మాట్లాడారు. ఎక్కడా తెలంగాణాలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీయారెస్ ని పేరెత్తి విమర్శించలేదు. ముఖ్యమంత్రి కేసీయార్ పాలనా విధానాలను కూడా సూటిగా తూర్పారా పట్టలేదు. చాలా జనరలైజ్ చేస్తూ పవన్ మాట్లాడారు. ఇంకా చెప్పాలంటే చాలా బాలన్స్ గా మాట్లాడారు. తెలంగాణా ఎన్నికల సభలో లోక్ సభ ఎన్నికల గురించి మాట్లాడడమూ పవన్ కే చెల్లింది ఈ దేశానికి మరోసారి ప్రధానిగా మోడీ రావాలని కోరడం మంచిదే అయినా ప్రస్తుతం తెలంగాణా ముఖ్యమంత్రి కోసం ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణాలో బీజేపీ జనసేన ప్రభుత్వం రావాలని పవన్ గట్టిగా కోరి ఉంటే బాగుండేది అన్న మాట ఉంది. అంతే కాదు మాకు ఓటు వేయండి అని అడిగే ముందు ప్రస్తుతం అధికారంలో ఉన్న బీయారెస్ కి ఎందుకు వేయకూడదో కూడా చెప్పి ఉండాలి. ఆ విషయంలో పవన్ కళ్యాణ్ మెత్తమెత్తగానే మాట్లాడారు అని అంటున్నారు. తెలంగాణా రాష్ట్ర సాధన జరిగింది కానీ అభివృద్ధి సాధన జరగలేదు అని పవన్ చెప్పడం జరిగింది. అంతే కాదు. నీళ్ళు నిధులు, నియామకాలు అంటూ పోరాడిన తెలంగాలలో ఆ మేరకు విజయం సాధించామా అన్నది మాత్రం ప్రశ్నగా మిగిలిపోయింది అని పవన్ అన్నారు. తెలంగాణాలో అభివృద్ధి కావాలని ఆయన కోరుకున్నారు. అంతే కాదు పోరాటంలో గెలుపు ఉండాలని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎపుడూ ఎన్నికల వాతావరణమే ఉందని రాజకీయాలే తప్ప అభివృద్ధి లేదని ఒక నిశితమైన విమర్శ చేశారు ఇది కూడా జనరలైజ్ చేస్తూ సాగింది. మొత్తానికి కేసీయార్ పేరెత్తకుండానే పవన్ ప్రసంగం సాగింది. మరి ఇది సేఫ్ సైడ్ గా చేసిన ప్రసంగం అన్న చర్చ వస్తోంది. ఎందుకంటే ఇప్పటిదాకా పవన్ తెలంగాణా ప్రభుత్వాన్ని ఎక్కడా విమర్శించలేదు. ఎన్నికల వేళ ఘాటుగానే విమర్శలు ఉండాలి. లేకపోతే జనానికి హుషార్ రాదు, రాజకీయాల్లో మసాలా ఉండదు, కానీ పవన్ మాత్రం ఎందుకో సాదా సీదాగానే మాట్లాడుతూ జాతీయ రాజకీయాలు మోడీ సాధించిన విజయాలు చెప్పుకొచ్చారు. ఒక విధంగా మోడీని ప్రధానిగా గెలిపించమంటూ చేసిన ప్రసంగంలా ఉంది తప్ప తెలంగాణాలో బీజేపీని గెలిపించమని చేసినట్లుగా లేదు అని అంటున్నారు. ఏది ఏమైనా రానున్న రోజులలో పవన్ ఎన్నికల ప్రసంగాలు ఎలా ఉంటాయో చూడాలని అంటున్నారు.

# 30వ తేదీన కాంగ్రెస్ దెబ్బకి బిఆర్ఎస్ బాక్స్ బద్దలవడ్డం కాయం

### భారీ ర్యాలీతో బయలదేరి నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్



కూకట్‌పల్లి : కూకట్పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ నామినేషన్ ర్యాలీ హోరెత్తింది. గురువారం ఉదయం మొదట కెపిహెచ్బి మూడో ఫేసులోని వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడనుండి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి, బోనాలు డబ్బులు కళాకారుల విన్యాసాల నడుమ భారి ర్యాలీతో ముందుకు సాగారు. ఇక టెంపుల్ బస్టాప్ లో పార్టీ నేతలు భారీ గజమాలతో రమేష్ ను సత్కరించారు. రమేష్ కి మద్దతుగా ఇతర పార్టీల నేతలు సైతం పాల్గొన్నారు. కేపీహెచ్బి వీధులన్నీ కాంగ్రెస్ పార్టీ జెండాలు, యువత కేరింతలతో జనసంద్రం అయ్యాయి. కెపిహెచ్బి ధనలక్ష్మి సెంటర్ రోడ్ నెంబర్ వన్ లోధ టవర్స్ నాల్గవ ఫేజ్ మసీదు, కైతలాపూర్ ఆంజనేయ నగర్ మీదుగా మూసాపేట్ లోని జోనల్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ర్యాలీలో టిపిసిసి ప్రతినిధి సత్యం శ్రీరంగం యువ నేత గొట్టుముక్కుల వెంకటేశ్వరరావు ఎన్ ఎస్ యు ఐ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ పార్టీ నేతలు కార్యకర్తల ఉత్సాహం తనకి మరింత బలాన్ని చేకూర్చిందన్నారు. కాంగ్రెస్ గెలుపు ఖాయం అని బిఆర్ఎస్ తట్ట బుట్ట సర్దుకుని సిద్ధంగా ఉండాలనన్నారు. ఈ రేట్టించిన ఉత్సాహంతో కూకట్పల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి సోనియా గాంధీ బహుమతిగా ఇస్తానన్నారు. ఆరు నూరైనా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఇప్పటికే కర్ణాటకలో అక్కడ ప్రకటించిన గ్యారెంటీలు విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 30వ తేదీన కాంగ్రెస్ దెబ్బకి బిఆర్ఎస్ బాక్స్ బద్దలవుతుందని ఘాటుగా స్పందించారు.

# పదవుల కోసం పాకులాడేవారు, పార్టీని విడినంతమాత్రాన, బిఆర్ ఎస్ పార్టీకి ఒరిగేదేం లేదు...

### విడిన వారంతా తిరిగి రావడం తథ్యం...
### ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆరే
### బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జహంగీర్



శామీర్ పేట (గరుడ వార్త) : పదవులు ఆశించి తమ స్వార్థం కోసం కొందరు పార్టీని వీడినంత మాత్రాన, బిఆర్ఎస్ పార్టీకి ఎటువంటి నష్టం లేదని, ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ నే ప్రజలు గెలిపిస్తారంటూ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జాంగిర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలతో తమ పార్టీ నాయకులను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని, అది ఎన్నటికీ సాధ్యం కాదని వారన్నారు. గత 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు పడ్డ గోస, ఇంకా ఎవరు మర్చిపోలేదన్నారు. కరెంటు కోతల వల్ల ఇటు రైతు, అటు కర్మగారాలు ఎన్నో ఇబ్బందులు చవి చూశాయని జహంగీర్ అన్నారు. ఇటు మేడ్చెల్ లో అటు యావత్ తెలంగాణలో తమ ప్రభుత్వమే వస్తుందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జహంగీర్ ధీమా వ్యక్తం చేశారు. ముచ్చటగా మూడోసారి కూడా ముఖ్యమంత్రిగా తమ నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి కాబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం డి సి ఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి మేడ్చల్ నియోజకవర్గం మొత్తం గులాబీ మయమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అరాచక పరిపాలనను ఇంకా తెలంగాణ సమాజం మర్చిపోలేదన్నారు. ఇతర పార్టీల్లో చేరిన వారంతా తిరిగి త్వరలోనే తమ పార్టీలో చేర్తారని ధీమా వ్యక్తం చేశారు. రైతుబంధు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నారెడ్డి నందా రెడ్డి మాట్లాడుతూ... పదవులు దక్కలేదని పార్టీని వీడి వెళ్లిపోవడం సమంజసం కాదని, కార్యకర్తలు నాయకులు పదవుల కోసం కాకుండా, పార్టీ కోసమే పని చేయాలన్నారు. అటువంటి వారికి తప్పక మునుముందు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, స్థానిక సర్పంచ్ జాము రవి, ఎఎంసి వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి అనిల్, కీసర గుట్ట దేవస్థానం డైరెక్టర్ నాగరాజు, జిల్లా నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, మురలీగౌడ్, యాంజాలరవీంధర్, బూరుగుయాదగిరి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్క ఓటరు, తన ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి

### ఓటు వేయాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలి...
### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ఓటర్లందరు నిష్పక్షపాతంగా, స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమని,18 సంవత్సరాల నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లందరూ పోలింగ్ రోజు ఏక్కడికి వెళ్లకుండా బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకొని వారి సత్తా చాటాలన్నారు. నూతన యువ ఓటర్లు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఈ నెల 30న జరిగే పోలింగ్ లో పాల్గొని తొలి ఓటు అనుభూతి పొందాలన్నారు. ప్రజాస్వామ్య భారత దేశంలో అన్ని దేశలకంటే యువత ఎక్కువగా ఉన్నారని, రాజకీయ నిర్ణయాధికారం యువతదేనని, చైతన్యవంతులై వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటర్లను మభ్యపెడ్తూ డబ్బు ,మద్యం ,ఏదైనా వస్తువుల పంపిణీ జరిగితే, సి- విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుదుతామన్నారు. ఓటరు జాబితా లో ఉన్నఓటర్లందరికి ఓటరు స్లిప్పులు పంపిణి చేస్తామని " ప్రతి ఓటరు తప్పాక తన ఓటు వేస్తాను" అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఫోటోతో ఉన్న ఓటరు కార్డ్ లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డ్ లో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని అన్నారు. ఓటర్ ఎపిక్ కార్డు, . ఆధార్ కార్డు, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్డ్ ,బ్యాంక్ /పోస్టఆఫీస్ ( ఫోటో తో ఉన్నవి) పాస్ బుక్ లు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, జాతీయ జనాభా రిజిస్టరు జారీ చేసిన స్మార్ట్ కార్డ్, భారత పాస్ పోర్ట్, ఫోటో తో ఉన్న పించన్ పత్రం,ఉద్యోగులకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం /ప్రభుత్వ సంస్థలు /పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ లు జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డ్, దివ్యంగుల గుర్తింపు కార్డ్, చట్ట సభల లో సభ్యత్వన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డ్ లలో ఎదో ఒక గుర్తింపు కార్డ్ ను తీసుకొని పోలింగ్ స్టేషన్ కి వచ్చి ఓటు వేయాలన్నారు.

# నవంబర్ 30 పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్...

గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: రాష్ట్ర శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల్లోని నవంబర్ 30 న పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు ఉండబోతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపినారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా తేది 30-11-2023 గురువారం రోజున రాష్ట్రంలోని 119 అసెంబ్లి నియోజకవర్గాల పరిధీలొని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు వేతనంతో కూడిన ప్రభుత్వ సెలవును ప్రకటిస్తూ ప్రభుత్వం రాజపత్రాన్ని(%Gazette%) జారీచేసిందని పేర్కొన్నారు ప్రభుత్వం



వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించినందున మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా పరిధి లొని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం, మల్కాజిగిరి నియోజకవర్గం, కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గం,కుత్భుల్లాపూర్ నియోజకవర్గం, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గలలో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోని జిల్లాలో వందశాతం ఓటింగ్ జరగేలా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ కోరారు

# సాగుకు దన్ను.. మహిళలకు ఉపాధి!

మద్నూర్ :రైతు పండించిన ఉత్పత్తుల్లో కేవలం 60 శాతం మాత్రమే వినియోగం అవుతోంది. 40 శాతం వృథా అవుతున్నట్లు పలు సర్వేలు స్పష్టం చేశాయి. తద్వారా రైతు పెట్టుబడులు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు పల్లెల్లో ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్న మహిళలు ఎక్కువగా ఉంటున్నారు. ఈ రెండు ప్రధాన సమస్యలకు పరిష్కారమార్గంగా ఎన్ఐఐఎఫ్(నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందల్‌వాయి మండలం గన్నారంలో ఇటీవల ప్రయోగాత్మకంగా 'ది గ్రామోన్నతి ట్రస్ట్' ఆధ్వర్యంలో 'రవికిరణ్ ప్రాజెక్టు' పేరుతో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది.

సోలార్ డ్రయర్లతో..రైతులు పండించిన అదనపు వ్యవసాయ ఉత్పత్తులు(టమాట, ఉల్లి, మామిడి, క్యారెట్) వీరు సేకరిస్తారు. పాలీహౌస్‌లో సోలార్ డ్రయర్లతో వాటిలోని తేమ తొలగించి డ్రై ఫ్రూట్స్, స్వీట్లు తయారు చేస్తారు. వాటిని నిల్వ చేసి ఎప్పుడైనా విక్రయించుకోవచ్చు. ఎలాంటి రసాయనాలు వాడకుండా కేవలం సూర్యరశ్మితో



ఆరోగ్యకరమైన ఉత్పత్తులు తయారు చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. వీటిని దేశ, విదేశాల్లో విక్రయించేలా మార్కెట్ వసతి కల్పిస్తారు.

ఆతాంగ్ సహకారం

'కార్పొరేట్ సామాజిక బాధ్యత'లో భాగంగా టోల్‌ప్లాజా నిర్వహించే ఆతాంగ్ సంస్థ ఈ యూనిట్‌కు కావాల్సిన పరికరాలు సమకూర్చింది. ప్రాజెక్టు నిర్వహణకు కావాల్సిన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు టోల్‌ప్లాజా యాజమాన్యం తెలిపింది.

ప్రాజెక్టు లక్ష్యాలు

గ్రామాల్లోని రైతులు పండించే ఉత్పత్తుల మిగులును నిత్యం 3 టన్నుల వరకు సేకరించి, వాటిని ప్రాసెసింగ్ చేసి స్వీట్ రోల్స్ చేయడం. కనీసం 70 మందికి తగ్గకుండా ఉపాధి కల్పించడం. స్థానిక మహిళలు, మాజీ సైనికులకు శిక్షణ ఇవ్వడం. మహిళా సాధికారత సాధించడం.

రైతులకు లబ్ధి..- మోహన్‌రెడ్డి, సర్పంచి, గన్నారం

ప్రాజెక్టు లక్ష్యాలు చాలా బాగున్నాయి. ఇలాంటిది మా గ్రామంలో పెట్టించినందుకు టోల్‌ప్లాజా యాజమాన్యానికి కృతజ్ఞతలు. స్థానిక రైతులతో పాటు మహిళలకు లబ్ధి చేకూరనుంది.

సాధికారతకు కృషి

- చలపతి, టోల్‌ప్లాజా మేనేజర్, ఇందల్‌వాయి

మహిళా సాధికారత లక్ష్యంగా నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు చేపట్టాం. భవిష్యత్తులో దీన్ని విస్తరించి మరింత మందికి ఉపాధి కల్పించేలా కృషి చేస్తాం.

# కందనూలు క్షేత్రం.. ఉద్దండుల ప్రస్థానం

నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ రాజకీయం ఎన్నికల వేళ ఎప్పుడు రసవత్తరంగా సాగుతోంది. రాజకీయ ఉద్దండులు మహేంద్రనాథ్, నాగం జనార్దన్‌రెడ్డి ఇక్కడి నుంచే గెలుపొందారు. రాజకీయ చైతన్యమూ ఎక్కువే. అనేక మంత్రి పదువులు పొంది అభివృద్ధికి బాటలు వేశారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 16 సార్లు ఎన్నికలు జరగ్గా మూడుసార్లు మాత్రమే స్వతంత్రులు ఎన్నికయ్యారు. మిగతా 13 సార్లు వివిధ పార్టీలకు చెందిన నాయకులే గెలిచారు. అత్యధికం 24 ఏళ్ల పాటు నాగం జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా రాణించారు. 2004లో ఉమ్మడి జిల్లాలో అన్ని చోట్ల కాంగ్రెస్ గెలుపొందినా నాగర్‌కర్నూల్‌లో మాత్రం తెదేపా అభ్యర్థి నాగం జనార్దన్‌రెడ్డి విజయం సాధించారు. నాగం తొమ్మిదేళ్ల పాటు వివిధ శాఖలకు మంత్రిగా పనిచేశారు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలో తెదేపా అభ్యర్థి నాగం జనార్దన్‌రెడ్డిపై వంగ నారాయణగౌడ్ 52 ఓట్లతో గెలుపొందడం విశేషం. 2012లో తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో నాగం ఎమ్మెల్యే పదవికి, తెదేపాకు రాజీనామా చేశారు. ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. రాజకీయ ఉద్దండుడిగా పేరున్న నాగం జనార్దన్‌రెడ్డికి కాంగ్రెస్‌లో ఈ సారి టిక్కెట్టు దక్కలేదు.

1952లో ద్విసభ్య నియోజకవర్గంగా ఉండేది. ఒకటి జనరల్ కాగా మరొకటి ఎస్సీ రిజర్వుడ్ స్థానంగా ఉండేవి. మొదటి సాధారణ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ జనరల్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి చెందిన బ్రహ్మారెడ్డి మొదటిసారి ఎన్నికయ్యారు. స్వతంత్ర అభ్యర్థిగా అప్పట్లో ఆయనకు 26,243 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థికి ఏరెడ్డికి 8,841 ఓట్లు వచ్చాయి. బ్రహ్మారెడ్డి ఆ తర్వాత ఎప్పుడూ పోటీ చేయలేదు.

1957లో నాగర్‌కర్నూల్ ద్విసభ్య నియోజకవర్గం నుంచి బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లి గ్రామానికి చెందిన జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 26,743 ఓట్లతో ప్రత్యర్థి స్వతంత్ర అభ్యర్థి బి. గుప్తాపై గెలుపొందారు.

1962లో నాగర్‌కర్నూల్ ద్విసభ్య నియోజకవర్గం నుంచి పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడ గ్రామానికి చెందిన పుట్టపాగ మహేంద్రనాథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. స్వతంత్ర అభ్యర్థి బీఎం రావుపై గెలుపొందారు. అప్పటికే మహేంద్రనాథ్ నాగర్‌కర్నూల్ ప్రాంతంలో విద్యపై దృష్టి సారించారు. జాతీయోన్నత పాఠశాల నెలకొల్పారు. తర్వాత ఎన్నికల్లో మహేంద్రనాథ్ అచ్చంపేట నియోజకవర్గం ఎస్సీ రిజర్వు కావడంతో అక్కడికి వెళ్లారు.

1967, 1972లో నాగర్‌కర్నూల్ మండలం ఎండబెట్ల గ్రామానికి చెందిన వంగ నారాయణగౌడ్ వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన జనార్దన్‌రెడ్డిపై విజయం సాధించారు. రెండో సారి 1972లో కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచి స్వతంత్ర అభ్యర్థి ఎ. రాంచంద్రారెడ్డిపై గెలుపొందారు. వంగ నారాయణగౌడ్ 1967 నుంచి 1989 వరకు రాజకీయాల్లో కొనసాగారు. వంగ నారాయణగౌడ్ జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. అప్పట్లో కాంగ్రెస్ అంటేనే వంగ కుటుంబంగా పేరు వచ్చింది.

శ్రీనివాస్‌రావు కాంగ్రెస్ (ఐ) నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ ఎన్నికల్లో నలుగురు రంగంలో ఉన్నారు. జనతా పార్టీ నుంచి మాధవరెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌రావు పోటీ పడ్డారు. అప్పటి ప్రభుత్వంలో శ్రీనివాస్‌రావు ఆరు నెలల పాటు విద్యా శాఖ మంత్రిగా పనిచేశారు.

1983లో 53 ఓట్లతో గెలుపు..

1983లో పోటీ రసవత్తరంగా సాగింది. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనం కొనసాగినా తట్టుకొని కాంగ్రెస్ అభ్యర్థి వంగ నారాయణగౌడ్ తెదేపా అభ్యర్థి నాగం జనార్దన్‌రెడ్డిపై కేవలం 53 ఓట్లతో గెలుపొందారు. పోటీ నువ్వా నేనా అన్నట్లుగా సాగింది. అది అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ ఎన్నికల్లో నారాయణగౌడ్‌కు 22,342 ఓట్లు తెదేపా అభ్యర్థిగా పోటీ చేసిన నాగం జనార్దన్‌రెడ్డికి 22,290 ఓట్లు.. లోక్‌దళ్ నుంచి పోటీ చేసిన మాధవరెడ్డికి 14,694 ఓట్లు సీపీఐ అభ్యర్థి లింగారెడ్డికి 8,066 ఓట్లు వచ్చాయి.

నాగం జనార్దన్‌రెడ్డి తెదేపా అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి వంగ నారాయణగౌడ్‌పై గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా మాధవరెడ్డి బరిలో నిలిచారు.

వంగ నారాయణగౌడ్ కుమారుడు వంగ మోహన్‌గౌడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా తెదేపా అభ్యర్థి గోపాల్‌రెడ్డిపై గెలుపొందారు. తెదేపా టికెట్టు రాని నాగం జనార్దన్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలువడంతో త్రిముఖ పోటీ కొనసాగింది. మోహన్‌గౌడ్‌కు 44,046 ఓట్లు రాగా, తెదేపా అభ్యర్థి గోపాల్‌రెడ్డికి 25,233 ఓట్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నాగం జనార్దన్‌రెడ్డికి 21,568 ఓట్లు వచ్చాయి.

2014, 2018లో మర్రి జనార్దన్‌రెడ్డి..

2014, 2018లో రెండు సార్లు తెరాస అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి గెలుపొందారు. 2014లో మర్రి జనార్దన్‌రెడ్డికి 62,470 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్‌రెడ్డికి 48,035 ఓట్లు.. భాజపా నుంచి పోటీ చేసిన నాగం జనార్దన్‌రెడ్డి తనయుడు నాగం శశిధర్‌రెడ్డికి 27,789 ఓట్లు వచ్చాయి. 2018 ఎన్నికల్లో మర్రి జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నాగం జనార్దన్‌రెడ్డిపై 54,854 ఓట్లతో గెలుపొందారు.

ఐదు ఎన్నికల్లో వరుసగా నాగం జనార్దన్‌రెడ్డి

1994, 1999, 2004, 2009, 2012 ఎన్నికల్లో వరుసగా నాగం జనార్దన్‌రెడ్డి గెలుస్తూ వచ్చారు. ఐదు ఎన్నికల్లో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. 1999 నుంచి నాలుగు సార్లు తెదేపా నుంచి 2012లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ గెలుపొందాడు. 1994లో వంగ మోహన్‌గౌడ్‌పై 49040 ఓట్ల భారీ మెజార్టీ సాధించారు. 1999లో స్వతంత్ర అభ్యర్థి కూచుకుళ్ల దామోదర్‌రెడ్డిపై గెలుపొందారు. 2004లో నాగం జనార్దన్‌రెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోటీ సాగింది. నాగం 1,449 ఓట్లతో గెలిచారు. 2009లో తెదేపా అభ్యర్థి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కూచుకుళ్ల దామోదర్‌రెడ్డిపై గెలుపొందారు. తొమ్మిదేళ్ల పాటు నాగం జనార్దన్‌రెడ్డి పంచాయతీరాజ్, ఆబ్కారీ, పౌరసరఫరాలు, వైద్యం, తూనికలు కొలతలు, కరవు నివారణ మంత్రిగా పనిచేశారు. 2012లో తెలంగాణ ఉద్యమం సందర్భంలో తెదేపాకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కూచుకుళ్ల దామోదర్‌రెడ్డిపై గెలుపొందాడు. పునర్విభజనలో మారిన మండలం

2004లో నియోజకవర్గాల పునర్విభజనలో నియోజకవర్గంలో కొన్ని మార్పులు చేర్పులు జరిగాయి. పునర్విభజన కంటే ముందు నాగర్‌కర్నూల్, తాడూరు, గోపాల్‌పేట, తెలకపల్లి, బిజినేపల్లి మండలాలతో పాటు లింగాల మండలంలోని నాలుగు గ్రామాలతో నియోజవర్గంగా ఉండేది. 2004లో జరిగిన పునర్విభజనలో గోపాల్‌పేట మండలాన్ని వనపర్తిలో కలిపారు. జడ్చర్ల నియోజవర్గంలో ఉన్న తిమ్మాజిపేట మండలాన్ని నాగర్‌కర్నూల్‌లో కలిపారు. మండలం యూనిట్‌గా విభజన చేశారు. లింగాల మండలంలోని నాలుగు గ్రామాలు అచ్చంపేటకు వెళ్లాయి. నాగర్‌కర్నూల్, తెలకపల్లి, తాడురు, తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాలతో నియోజవర్గం ఏర్పాటైంది.

# ప్రలోభాల క్యాన్సర్‌ను తరిమేద్దాం

వరంగల్ : క్యాన్సర్ మహమ్మారి పేరు వింటేనే ప్రజలు వణికిపోతారు. ఇది కొన్ని సార్లు ప్రాణాంతకమే. చికిత్స కన్నా నివారణే మేలు అని వైద్యులు తరచూ చెబుతారు. ఇప్పుడు ప్రజలంతా మరో క్యాన్సర్‌పైనా దృష్టిపెట్టాలి. అదే ప్రలోభాల క్యాన్సర్. ఎన్నికలు సమీపిస్తున్నందున అనేక రాజకీయ పార్టీలు ఓట్ల కోసం డబ్బు, మద్యం, కానుకలు.. ఇలా అనేక విధాలుగా ఆశచూపి తమ వైపు మళ్లించుకోవడానికి ప్రయత్నిస్తాయి. మనిషికి క్యాన్సర్ పెద్ద జబ్బు అలాగే సమాజానికి ఎన్నికల ప్రలోభాలు క్యాన్సర్ లాంటిదే.'ఓటరుగా మనం ప్రలోభాలకు లొంగితే ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాజిక క్యాన్సర్ ప్రబలడానికి కారకులమవుతాం. కళ్లెదుట ప్రగతి కుంటుపడినా, నేత అవినీతిపరుడైనా ప్రశ్నించలేం. అక్రమాలన్నింటిని నిస్సహాయంగా చూస్తుండి పోవాల్సి వస్తుంది. క్యాన్సర్ సోకిన వ్యక్తి తన జీవితాన్ని కోల్పోయి.. నమ్ముకున్న వారందరిని అన్యాయం చేసి వెళ్లి పోయినట్లుగా డబ్బుకో.. మద్యానికో.. ఇతరాత్ర కానుకలకో ఓటును అమ్ముకుంటే రాచపుండు వంటి క్యాన్సర్ మన హక్కును కబళిస్తుంది'.

నవంబరు 7న 'జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం'గా నిర్వహిస్తారు. మంచి ఆరోగ్యకరమైన అలవాట్లు, జీవనశైలితో క్యాన్సర్‌ను నివారించాలనేది దీని ఉద్దేశం.'

జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకొంటాం. ఓటు హక్కు గురించి ప్రజలను చైతన్యపరుస్తారు. ఎన్నికలప్పుడు ఇదొక నిరంతర ప్రక్రియ అవుతుంది.

పరిస్థితి ఇదీ... మేల్కొందాం!

క్యాన్సర్ సోకగానే వెంటనే తెలియదు. లోపల దుష్పరిణామాలకు దారి తీస్తుంది.

నోటుకు ఓటు వల్ల జరిగే నష్టాలు ఇప్పుడు తెలియవు. భవిష్యత్తులో దీని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.

క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటి. దీని బారిన పడితే నిరంతరం పోరాడాలి. అవినీతి ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టిన దుర్గతుల్లో ఒకటి. దీని బారిన పడితే ఐదేళ్లు సతమతం కాక తప్పదు

క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం వల్ల ప్రాణాలను కాపాడుతుంది ఎన్నికలప్పుడు అవినీతికి అడ్డుకట్ట పడితే ప్రజాస్వామ్యం విరాజిల్లుతుంది ఆరోగ్యకర జీవనానికి పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు..ప్రాసెస్ చేసిన ఆహారాన్ని పరిమితం చేసే ఆహారం తీసుకోండి ప్రజాస్వామ్య మనుగడకు స్వచ్ఛమైన ఎన్నికల నిర్వహణలో ఓటర్లు క్రియాశీలక భూమిక పోషించాలి.

మొదటి దశలో గుర్తిస్తే మేలు

క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు. నేషనల్ హెల్త్ మిషన్ ఏటా అసంక్రమిత వ్యాధుల వివరాలను తెలియజేస్తుంది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్‌లోని ఒక్కో జిల్లాలో 200 నుంచి 250 మంది వరకు క్యాన్సర్ బారిన పడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అందుకే వరంగల్ కేఎంసీలో కీమోథెరపీ సైతం అందుబాటులోకి తెచ్చారు.

ఇప్పుడిప్పుడే ఆరంభం

ప్రలోభాల వ్యాధి పూర్తిగా సోకకముందే ప్రాథమిక దశలో గుర్తించాలి. నవంబరు 30న ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. కొన్ని పార్టీలు ఇప్పటి నుంచే ఓటర్లకు వల వేసేందుకు సిద్ధమవుతున్నాయి. వరంగల్, హనుమకొండ, జనగామ తదితర జిల్లాల్లో ఇప్పటికే ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై కేసులు నమోదయ్యాయి. వచ్చే రెండు మూడు వారాలు జోరుగా ప్రలోభాల పర్వం కొనసాగుతుంది.

అనేక ఉదాహరణలు

జనగామ జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఒక పార్టీకి చెందిన ఓటర్లకు కానుకలు పంచుతున్న క్రమంలో అధికారులకు ఫిర్యాదు అందింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని అధికారులు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. హనుమకొండ జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఒక పార్టీ వాళ్లు ఇప్పటి నుంచే డబ్బుల పంపిణీకి కసరత్తు చేస్తున్నారు. మహిళా సంఘాలు, యువజన సంఘాల్లో చురుగ్గా ఉండేవారిని ఎంపిక చేసి సమావేశాలకు ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతానికి రోజుకు రూ.200 ఇస్తామని, ఎన్నికలకు రెండు మూడు రోజుల ముందు భారీగా నగదు ఇస్తామని, తమ పార్టీ అభ్యర్థికే భారీగా ఓట్లు పడేలా చూడాలని ప్రలోభ పెడుతున్నారు. ఇదే మండలంలోని యువతకు ఇదే విధంగా గాలమేస్తున్నారు. దీనిపై ఎన్నికల అధికారులు కూడా దృష్టిసారించడం లేదు.

గత నెలలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో రెండు పార్టీలకు చెందిన వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు చేయగా పంపిణీకి సిద్ధమైన డప్పు వాయిద్యాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు.

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఒక గ్రామంలో టిఫిన్ బాక్సులను పంపిణీ చేసేందుకు సిద్ధంగా పెట్టగా అధికారులు పట్టుకున్నారు.

బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తున్నాయి–ఎ.పుష్పలత, జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి, వరంగల్

ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిస్తే సీ విజిల్ యాప్ ద్వారా, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

# ప్రశ్నార్థకంగా యాసంగి సాగు



మిర్యాలగూడ : సాగర్ ఎడమ కాల్వ పరిధిలో యాసంగి ఆశలు ఆవిరయ్యాయి. సాగునీటి కోసం ఎదురుచూసే పరిస్థితి లేకుండా పోయింది. సాగర్, శ్రీశైలం జలాశయాల్లో నీటి లభ్యత పూర్తిగా పడిపోయింది. తాగునీటికి మినహా సాగునీరు అందించేందుకు అవకాశాలు లేవు. వానాకాలంలోనే సరైన వర్షాలు లేక జలాశయాలకు వరదలు రాక ఏ కాల్వలకూ సాగునీరు విడుదల చేయలేదు. ప్రస్తుతం జలాశయాలు కనీస నీటి మట్టానికి చేరువలోకి వచ్చాయి. ఈ పరిస్థితుల్లో వర్షాలు కురిసి నిండుతాయనే ఆశలేదు. సాగర్ నీరు లేకపోవడంతో బావులు, బోర్లలో సైతం నీరు ఇంకిపోయింది. భూగర్భజలాలు బాగా తగ్గిపోయాయి. దీంతో యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం పడుతుంది.

**నీటి నిల్వల్లేవు:** సాగర్‌కు ప్రధాన వనరులైన ఆల్‌మట్టి, జూరాల, తుంగభద్ర, జలాశయాలలో నామమాత్రంగానే నిల్వలున్నాయి. శ్రీశైలంలో కనీస నీటి మట్టానికి చేరువలో ఉన్నాయి. సాగర్‌లో 524 అడుగుల మేర నీరున్నా మరో 14 అడుగులు తగ్గితే తీసుకునే అవకాశం లేదు. రోజురోజుకూ నీటి నిల్వలు తగ్గుతున్నాయి. గతంలోనే 510 అడుగుల కంటే తక్కువ ఉండకూడదన్న కోర్టు తీర్పులున్నాయి. అంటే నవంబరు నుంచి వచ్చే ఏడాది జులై వరకు ఈ నీరే తాగునీటికి ఆధారం. దీంతో పాటు రెండు దఫాలుగా వేసవిలో చెరువులు నింపేందుకు నీరు కావాలి. పాలేరు రిజర్వాయర్‌కు (ఖమ్మం తాగునీటికి) నీరు విడుదల చేయాలి. అక్కడ రిజర్వాయర్ 22.5 అడుగుల కంటే తగ్గితే సాగర్ నీరు విడుదల చేసి నింపాలి. వీలైనంత వరకు రెండు జలాశయాల్లో ఉన్న దాన్ని తాగునీటికే ప్రాధాన్యమిస్తారు. దీన్నిబట్టి చూస్తే సాగర్ ఎడమకాల్వ కింద సాగునీరు లేదు. దాదాపు ఎడమ కాల్వ కింద ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3.81 లక్షల ఎకరాల్లో సాగర్ నీరు రానట్లే. వానాకాలం ఒక్కతడి ఇచ్చి కొంతమేర పంటలు కాపాడారు. యాసంగికి ఆ అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు. క్రాప్ హాలీడే..2023–24 వ్యవసాయ సంవత్సరంలో క్రాప్ హాలీడే దాదాపు ఉన్నట్లే. వానాకాలంలో సాగునీరు విడుదల చేయలేదు. యాసంగికి నీరు రాదనేది సుస్పష్టం. రెండు సీజన్‌లలో పంటలకు సాగునీరు లేకపోవడంతో కేవలం ప్రత్యామ్నాయ సాగునీటి వనరులతోనే వరి సాగు చేస్తున్నారు. యాసంగిలో రైతులు బోర్లు, బావుల్లో నీటి లభ్యత, మార్చిలో ఎండల తీవ్రతకు భూగర్భజలాల స్థితి అంచనాలతోనే యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. అందుకే ఇప్పటికీ విత్తనాల కొనుగోళ్లు ఊపందుకోలేదు. యాసంగి సాగు చేయాలంటే నవంబరు 15 నాటికి నారు పోయడం ఆరంభిస్తారు. ఇంతవరకు 20 విత్తనాలు అమ్ముడైనట్లు విత్తన విక్రయదారులు పేర్కొంటున్నారు.

# యువతే కీలకం

జగిత్యాల : ప్రశ్నించే గుణం, స్పందించే తత్వం కలిగిన యువత సహజంగానే ఎన్నికల్లో అత్యధికంగా ప్రభావితమవుతారు. ఎన్నికల తరుణంలో రాజకీయ చర్చల నుంచి మొదలుకొని అన్ని పార్టీల తరఫున ప్రచారం చేయటం, సాంకేతిక సహకారం అందించటం వరకు తమవంతుగా పాలుపంచుకుంటుండగా ఇటీవల ఓటు నమోదు, ఓటింగ్‌శాతం పెంచటం, సచ్ఛీలురను ఎన్నుకునేలా కార్యక్రమాలు సైతం చేపడుతున్నారు. జిల్లాలో యువత అధికంగా ఉండటంతో యువచైతన్యం వెల్లివిరుస్తుండగా వచ్చే ఎన్నికల్లో వీరే కీలకంగా మారనున్నారు. అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాలో విద్యానుకూల పరిస్థితులు చైతన్యానికి దోహదం చేస్తున్నాయి. జిల్లాలో జేఎన్‌టీయూ, వెటర్నరీ, వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ డిగ్రీ, వ్యవసాయ పీజీ కళాశాలలు, పదుల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్, డిగ్రీ, వొకేషనల్ కళాశాలలుండటం, నిరోద్యోగ యువత అధికంగా ఉండటంతో పలు కళాశాలల్లో ఓటరు నమోదు కార్యక్రమాలు, న్యాక్ కేంద్రం, ఐటీఐ, ఇతరత్రా యువజన, స్వచ్ఛంద సంస్థలు తమవంతుగా ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వృద్ధులు, మధ్యవయసువారి ఆలోచనలు చాలావరకు స్థిరంగా ఉన్నా యువత ఆలోచన మాత్రం భిన్నంగా ఉంటుంది. ఇతరులు చెబితే తాము ప్రభావితం కావటంకన్నా తమ ఆలోచనలను ఇతరులు అనుసరించాలని యువత అధికంగా కోరుకుంటోంది. ఇటీవలే దాదాపుగా 37 వేల మంది యువత తమ ఓటుహక్కును నమోదు చేసుకోవటం విశేషం కాగా మొత్తం ఓటర్లలో 30 సంవత్సరాల్లోపువారి సంఖ్య 2.04 లక్షల వరకుండగా వీరు ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. కళాశాలల విద్యార్థులు, ఉద్యోగాలు, వ్యవసాయం చేస్తున్న యువతీ యువకులు ఎన్నికల నియమావళి నుంచి నిబంధనల అనుసరణ, అతిక్రమణలపై స్పందించటం తదితరాల్లో కీలకంగా ఉంటున్నారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడాలేకుండా చాలామంది కనీసం చదువుకున్నవారే ఉండటంతో ప్రస్తుత సామాజిక మాధ్యమాల ద్వారానూ వీరు ఓటరు చైతన్యం, ఓటు నమోదు, ఓటు వేయటం, పోలింగ్, పార్టీల పాత్ర తదితర చాలా అంశాలపై పెద్దఎత్తున స్పందిస్తున్నారు. వ్యక్తిగతంగా, గ్రూపులుగానూ సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండగా వీరిలో కొందరు పార్టీల ద్వారానూ ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. యువత తాము నమ్మిన అంశాలను తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులచే ఆచరింపచేస్తారు కాబట్టి ఓటింగ్ సరళిని మార్చటమనేది యువత చేతిలోనే ఉన్నందున ప్రస్తుత ఎన్నికల్లో యువతను ఆకట్టుకోవటంపై రాజకీయ పార్టీలు ప్రధానంగా దృష్టిసారించాయి.

# చేతులు కలిసేదెలా.?

వరంగల్ : వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కొన్ని శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌లో అసమ్మతి చల్లారడం లేదు. ఎమ్మెల్యే టికెట్లు ఆశించి భంగపడిన నాయకులు పంతం వీడటం లేదు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా ఇంతవరకు ముఖ్యమైన నాయకులు చేతులు కలపలేదు. ఎవరికి వారే అన్నట్లుగా ఉంటున్నారు. టికెట్లు పొందిన అభ్యర్థులు ఒంటరి పోరాటం చేస్తున్నారు. పరకాల టికెట్టు ఆశించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డిని ఐదు రోజుల కిందట అధిష్ఠానం నియమించిన బుజ్జగింపుల కమిటీ పెద్దలు సముదాయించారు. కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డికి సహకరించేందుకు ఆయన అంగీకరించారు. ఇదే పద్ధతి మిగిలిన నియోజకవర్గాల్లో ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేటలో ముఖ్య నాయకులు 'చేయి' కలపకపోవడంతో కార్యకర్తలు, ప్రజల్లో అయోమయం నెలకొంది.

వరంగల్ పశ్చిమలో టికెట్టు ఖరారుకు ముందే జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి మధ్య దూరం పెరిగింది. పశ్చిమ అభ్యర్థిగా రాజేందర్‌రెడ్డిని ప్రకటించడంతో పంచాయితీ మరింత ముదిరింది. ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు సీనియర్ నాయకులు లేరు. వారం రోజులవుతున్న బుజ్జగింపుల కమిటీ చొరవ చూపడం లేదు. జంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి, పోటీపై కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుంటున్నారు. ఆలిండియా ఫార్వర్డ్ నుంచి పోటీకి సై అంటున్నారు. ఏఐసీసీ స్థాయిలో బుజ్జగిస్తే రాఘవరెడ్డి వెనక్కి తగ్గే అవకాశాలుంటాయని కార్యకర్తలంటున్నారు.

వరంగల్ తూర్పులో ముఖ్య నాయకులు కదలడం లేదు. కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి తిరుగుతున్నారు. ఎమ్మెల్యే టికెట్టు ఆశించి భంగపడిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఉపమేయర్ ఎంబాడి రవీందర్ అలక వీడటం లేదు. వీరితో మాట్లాడేందుకు ఎవరూ చొరవ చూపడం లేదని తెలిసింది. వరంగల్‌లోని ఓ హోటల్‌లో అసంతృప్త నాయకులతో కొండా మురళి సమావేశమయ్యారు. తుది నిర్ణయం వెలువడలేదు. వర్ధన్నపేటలో నాయకుల మధ్య విభేదాలు తార స్థాయికి చేరాయి. కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజు వాహన శ్రేణిపై ఒక వర్గం దాడి చేశారు. ఈ ఘటన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. టికెట్టు ఆశించిన నమిండ్ల శ్రీనివాస్, పరంజ్యోతి తదితరులతో మాట్లాడేవారు లేరు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సొంత నియోజకవర్గమైనప్పటికీ ఇంత వరకు కాంగ్రెస్ అభ్యర్థి వెంట కనిపించలేదు. మిగిలిన నియోజకవర్గాల కంటే వర్ధన్నపేట నాయకుల మధ్య విభేదాలు ఎక్కువగా ఉన్నాయి. అధిష్ఠానం కలుగజేసుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు.

# కోడ్ ఉల్లంఘిస్తే.. కొరడా

భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న సాంస్కృతిక సారథి కళాకారిణి అక్టోబర్ 27న బట్టుపల్లిలో ఓ పార్టీ సభలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినందున జిల్లా కలెక్టర్ ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లాలోని మరో సాంస్కృతిక సారథి కళాకారుడు పెద్దపల్లి జిల్లా రామగుండంలో నిర్వహించిన ఎన్నికల సభలో పాల్గొన్నారు. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జిల్లా ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పని చేయడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద ఆయన సస్పెండయ్యారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి పెరిగిపోతోంది.. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా జిల్లా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.. పోటీ చేసే అభ్యర్థులు లేదా రాజకీయ పార్టీపై ప్రతి ఒక్కరికీ ఎంతో కొంత అభిమానం ఉంటుంది. ప్రచారం సందర్భంగా సభలు, సమావేశాల్లో పాల్గొనడానికి ఆసక్తి చూపుతారు. ఈ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిందే.. ఎన్నికల సభలు, సమావేశాలు, రాజకీయ పార్టీలకు మద్దతు తెలపడం లాంటి చర్యలకు పాల్పడితే వారిపై ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటుంది.

వేల సంఖ్యలో..ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు ఎలాంటి రాజకీయ పార్టీలకు బహిరంగ మద్దతు తెలపకూడదని నిబంధనలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆరు జిల్లాల్లో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు వేల సంఖ్యలో ఉన్నారు. వీరంతా ఎన్నికల నిబంధనల మేరకు విధులను నిర్వర్తించాలి.

సామాజిక మాధ్యమాల్లో ఒక వ్యక్తిపై, పార్టీలు, నాయకులపై వ్యక్తిగతంగా దూషణలకు దిగడం, ప్రతిష్ఠ దిగజార్చేలా పోస్టులు పెడితే వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపైనా కేసులు నమోదు చేస్తారు.

భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో వాట్సాప్ వేదికగా ఒక నాయకుడికి చెందిన బంధువులపై చెడుగా పోస్టు చేయడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ వ్యక్తి, గ్రూప్ అడ్మిన్‌పై కేసు నమోదు చేశారు. కాటారం మండలంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై సామాజిక మాధ్యమాల్లో అనుచితంగా పోస్టు చేసి కాటారం మండలానికి చెందిన ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎన్నికల సమయంలో సామాన్య ప్రజలు కూడా సామాజిక మాధ్యమాలపై జాగ్రత్తగా ఉండాల్సిందే..

సామాజిక మాధ్యమాలపైనా..

ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాలపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొంతమంది ఉద్యోగులు తమకు నచ్చిన నాయకుల తరఫున అంతర్జాలంలో ప్రచారం చేస్తుంటారు. ఎవరికీ తెలియదని, గమనించరని వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్‌లో పోస్టులు పెడుతుంటారు. అలాచేస్తే.. త్వరగా దొరికిపోవడం ఖాయం. ప్రభుత్వ ఉద్యోగుల సోషల్ అకౌంట్లపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టిందని అధికారులు తెలిపారు. నిబంధనలు ఇవే..రాజకీయ పార్టీలు, నాయకులకు వ్యతిరేకంగా మాట్లాడటం, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం లాంటి పనులు చేయకూడదు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచారం, సభలు, సమావేశాల్లో పాల్గొనకూడదనే నిబంధన సెక్షన్ 23(ఐ) ప్రకారం ఎన్నికల కోడ్ ఉన్నన్ని రోజులు అమల్లో ఉంటుంది.

# రెట్టింపు సంఖ్యలో బ్యాలెట్ యూనిట్లు

హైదరాబాద్: రాష్ట్ర శాసనసభకు ఈనెల 30న జరగనున్న ఎన్నికలకు అధికారులు ఈవీఎంలను సిద్ధం చేశారు. ఇటీవల వరకు ఓటరు దరఖాస్తులకు అవకాశమివ్వడంతో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరగొచ్చని భావిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు పెరిగినా, అభ్యర్థులు భారీ సంఖ్యలో పోటీకి దిగినా కొరత ఉత్పన్నం కాదని అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల సంఖ్యతో పోల్చినపుడు, దాదాపు రెట్టింపు బ్యాలెట్ యూనిట్లు హైదరాబాద్ జిల్లాలో అందుబాటులో ఉన్నాయని స్పష్టంచేస్తున్నారు.

కొత్త జాబితాలోకి..అక్టోబరు 4న విడుదలైన ఓటరు తుది జాబితా ప్రకారం.. హైదరాబాద్ జిల్లాలో 44లక్షల మంది ఓటర్లకు 3,986 పోలింగ్ కేంద్రాలున్నాయి. అనంతరం అక్టోబరు 31 వరకు మరింత మంది ఓటర్లుగా జాబితాలో చేరారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. పోలింగ్ కేంద్రానికి గరిష్ఠంగా 1400-1600 మంది ఓటర్లుండాలి. మించితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేయాలి. ఈ నేపథ్యంలో కొత్త జాబితాలోకిపోలింగ్ కేంద్రాలను కలిపినా.. ప్రస్తుతమున్న సరిపోతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఈవీఎం అంటే..

కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ జతను ఈవీఎం అంటారు.



సాంకేతికంగా ఒక పోలింగ్ కేంద్రానికి ఒక కంట్రోల్ యూనిట్ సరిపోతుంది. ఒక బ్యాలెట్ యూనిట్‌పై చివరగా నోటా మీట ఉండాలి. దాంతో 15 మంది అభ్యర్థుల పేర్లను మాత్రమే బ్యాలెట్ యూనిట్‌పై అంటించి ఎన్నిక నిర్వహించగలం. అభ్యర్థులు 15కి మించితే మరో బ్యాలెట్ యూనిట్‌ను, 31కి మించితే మూడో బ్యాలెట్ యూనిట్‌ను కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానించాల్సి ఉంటుంది. అందుకే కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను అన్ని నియోజకవర్గాలకు పోలింగ్ కేంద్రాల సంఖ్యతో పోల్చినప్పుడు 125శాతం అదనంగా, 140శాతం వీవీప్యాట్లను పంపినట్లు అధికారులు చెబుతున్నారు. అవన్నీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేసిన డీఆర్‌సీ(డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్) కేంద్రాల్లో భద్రంగా ఉన్నాయని జీహెచ్ఎంసీ భరోసా వ్యక్తంచేస్తోంది. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరో 70శాతం బ్యాలెట్ యూనిట్లు, 30శాతం కంట్రోల్ యూనిట్లు, 15శాతం వీవీప్యాట్లను చాదర్‌ఘాట్‌లోని విక్టరీ క్రీడా ప్రాంగణంలో భద్రపరిచినట్లు తెలిపింది. మరో 397 ఈవీఎంలను వేర్వేరు ప్రాంతాల్లో తిప్పుతూ ఓటర్లకు ఓటు విధానంపై అవగాహన కల్పిస్తున్నట్లు జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం వివరించింది.

# జాడలేని పత్తి కొనుగోళ్లు..!

కాగజ్‌నగర్ : అధికార యంత్రాంగం, పాలకులు ఎన్నికల హడావుడిలో ఉండటంతో మిగతా కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. జిల్లాలో ఈపాటికే ప్రారంభం కావాల్సిన పత్తి కొనుగోళ్లపై.. ఇప్పటికీ స్పష్టమైన సమాచారం లేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు అన్నదాతలకు ఎంతో కొంత ముట్టజెప్తూ.. తెల్లబంగారాన్ని గోదాంలలో నిల్వ చేస్తున్నారు. చేతికందిన పత్తి పంటకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖపై ఉంది. కానీ జిల్లా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. కొన్నిచోట్ల పత్తి ఏరడం మొదలైంది. దీపావళి పండగ వేళ ఖర్చులకు, ఇతర అవసరాలకు నగదు అవసరమైతే వచ్చిన పంట వచ్చినట్టే విక్రయిస్తున్నారు. సీసీఐ కొనుగోళ్లు, ప్రభుత్వ మార్కెట్‌లలో ఇప్పటికీ ఎలాంటి సమాచారం లేకపోవడంతో నేరుగా ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020 ప్రకటించింది. కాగా వ్యాపారులు సుమారు రూ.1000 వరకు కోత విధిస్తున్నారు.



తనిఖీలు కరవు..జిల్లాలో కాగజ్‌నగర్, జైనూర్, ఆసిఫాబాద్‌లలో మార్కెట్ యార్డులున్నాయి. ఈ మూడు మార్కెట్ యార్డుల్లో నేటి వరకు పత్తి కొనుగోళ్లపై స్పష్టమైన సమాచారం లేదు. ఆయా గ్రామాల్లో మొదటి దశలో చేతికి వచ్చిన పత్తి పంటను విక్రయించుకునేందుకు రైతులు వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకొని వ్యాపారులు క్వింటాల్ పత్తికి రూ.6,090 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల కొనుగోళ్లపై మార్కెటింగ్‌శాఖ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉండగా.. ఆ దిశగా దృష్టిసారించడం లేదు. అధికారులు స్పందించి త్వరగా కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్‌ను సంప్రదించగా.. త్వరలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికార యంత్రాంగం, పాలకులు ఎన్నికల హడావుడిలో ఉండటంతో మిగతా కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. జిల్లాలో ఈపాటికే ప్రారంభం కావాల్సిన పత్తి కొనుగోళ్లపై.. ఇప్పటికీ స్పష్టమైన సమాచారం లేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు అన్నదాతలకు ఎంతో కొంత ముట్టజెప్తూ.. తెల్లబంగారాన్ని గోదాంలలో నిల్వ చేస్తున్నారు.

# ఇంటి చెంతకే మినీ పోలింగ్ స్టేషన్!




ఖమ్మం : ప్రజాస్వామ్యంలో ఓటును వజ్రాయుధంగా అభివర్ణిస్తారు. అదొక్కటి చాలు, అభ్యర్థుల తలరాతలను తారుమారు చేయడానికి. కానీ, పట్టణాల్లో సైతం పలు కారణాలతో ఎంతో మంది పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ఓ వైపు దేశ స్వాతంత్ర్య వజ్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నా.. ఇంకోవైపు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును సౌకర్యవంతంగా, నిర్భయంగా వినియోగించుకునే పరిస్థితులు చాలాచోట్ల లేవనే చెప్పాలి. ఈ నేపథ్యంలో తాజాగా జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన పోలింగ్ నమోదుకు భారత ఎన్నికల సంఘం పలు సంస్కరణలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విస్తృత చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన వారికి తొలిసారి బ్యాలెట్ ఓటు అవకాశం కల్పిస్తోంది. ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు జిల్లాలో వేల మంది స్పందించడం విశేషం. నేటితో దరఖాస్తు గడువు ముగియనుంది.

ఓటేసే విధానం '12డి' ఫాం దరఖాస్తుదారుల జాబితాను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్థాయిలో రూపొందిస్తారు. బూత్ లెవల్ అధికారుల(బీఎల్ఓ) ద్వారా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.


వారు ఫలానా రోజు బ్యాలెట్ ఓటు వేయాలని కోరుతూ ఓటరుకు ముందుగానే సమాచారం తెలియజేస్తారు.

నిర్ణీత రోజున ఓటరు నివాసానికి నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి, మండల స్థాయిలో డిప్యూటీ తహసీల్దార్, మైక్రో అబ్జర్వర్, వీడియోగ్రాఫర్, పోలీసులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తరలివెళ్తారు. వారి సమక్షంలో పోలింగ్ బూత్ మాదిరిగా కంపార్టుమెంట్ ఏర్పాటు చేసి, అందులో ఓటరు రహస్యంగా బ్యాలెట్ ఓటేసేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ ప్రక్రియను చిత్రీకరిస్తారు.

ఆ ఓటును సీల్ చేస్తారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ద్వారా ఆర్ఓ కార్యాలయానికి చేర్చుతారు.

ఇలా సేకరించిన బ్యాలెట్ ఓట్లను సమయానికి లెక్కింపు కేంద్రానికి తీసుకెళ్తారు.ఎక్కడా పార్టీల ప్రలోభాలకు తావులేకుండా, ఓటరు స్వచ్ఛందంగా నచ్చిన అభ్యర్థికి ఓటేసేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. రహస్య పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు, పోలీసులు, సర్వీస్ ఓటర్ల తరహాలో ఈ సారి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే అవకాశాన్ని వయోవృద్ధులు, దివ్యాంగులకు, కరోనా బాధితులకు ఎన్నికల సంఘం కల్పిస్తోంది. దీనికి సంబంధించిన ప్రక్రియను జిల్లా ఎన్నికల యంత్రాంగం పకడ్బం దీగా అమలు చేస్తోంది. బ్యాలెట్ ఓటు ప్రక్రియకు ప్రత్యేక బృందాలను నియమించింది. 'ఫాం 12డి' సేకరణ.. బ్యాలెట్ల అందజేత, స్వీకరణ వీరి బాధ్యత. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు పోలింగ్ ఈ నెల 30న జరుగుతుంది. కానీ దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన వారికి ఈ నెల 24 నుంచి 29 తేదీ వరకు మొత్తం అయిదు రోజుల పాటు బ్యాలెట్ ఓటేసే అవకాశం కల్పిస్తున్నారు. జిల్లాలో మొత్తం 43,729 మంది అర్హులుండగా.. వీరిలో వేలాది మంది '12డి' ఫాంలు అందజేశారు. ఖమ్మం జిల్లాలో బ్యాలెట్ ఓటుకు గుర్తించిన మొత్తం దివ్యాంగులు 26,968 మంది ఉండగా, 80 ఏళు దాటిన వారు మరో 16,761 మంది ఉన్నారు.

# నెలరోజుల్లో 9 భూకంపాలు




హైదరాబాద్: భారత్-నేపాల్ సరిహద్దులోని ఇండియన్-యూరోసియన్ ప్రాంతంలో భూగర్భంలోని ప్రకంపనల వల్లే నేపాల్‌లో భూకంపం సంబవించిందని ఉత్తరాఖండ్‌లోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ) విశ్లేషించింది. గత అక్టోబరు 3 నుంచి నవంబరు 3 మధ్య జాజర్‌కోట్ జిల్లా సహా ఉత్తరాఖండ్-నేపాల్ సరిహద్దు, జుమ్లా జిల్లాలతోపాటు తొమ్మిదిచోట్ల భూకంపం సంభవించింది. తాజాగా మరోసారి కంపించింది. ఈ ప్రకంపనలు దిల్లీ పరిసర ప్రాంతాల్లో కనిపించాయని సీబీఆర్ఐ సంచాలకులు ప్రొఫెసర్ ప్రదీప్ కె.రామన్‌చెర్ల వివరించారు. రామిదండలో భూగర్భంలో 17.9 కిలోమీటర్ల అడుగున ఈనెల 3న భూమి కంపించిందని ఆ ప్రభావం జాజర్‌కోట్, పశ్చిమ రుకుం జిల్లాపై తీవ్రంగా పడిందని, వందల సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయని, 200 మందికిపైగా మరణించారని వివరించారు. కొండపై ఇళ్లు నిర్మించుకున్న ప్రజలు వాటిని కట్టుకునేప్పుడు రాళ్లు, ఇటుకలకు మధ్య సిమెంట్ మిశ్రమం కాకుండా మట్టితో కట్టుకోవడంవల్లే ఎక్కువ నష్టం జరిగిందిని వివరించారు. ఈ ప్రకంపనల కారణంగా అక్కడికి 600 కిలోమీటర్ల దూరంలోని దిల్లీలోనూ ఇళ్లపై ప్రభావం కనిపించిందన్నారు. భూకంప లేఖినిలో 6-7 మధ్యలో నమోదైతే అత్యంత తీవ్ర ప్రమాదమని తెలిపారు. హిమాలయాల్లో భౌగోళిక పరిస్థితుల మార్పుల కారణంగా తరచూ భూకంపాలు సంభవిస్తున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం కాఠ్‌మాండులో జరిగిన భూకంపంలో 9 వేలమంది చనిపోయారు. సెస్మిక్ జోన్‌ల ఆధారంగా భూకంపాలు ఎక్కడ, ఎలా వస్తాయో వాటి తీవ్రత ఎంత ఉంటుందో తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రజలకు జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించడం, ఇళ్లు, వాణిజ్య భవనాలు, పాఠశాలలు భూంకపాలను తట్టుకునేలా నిర్మాణాల్లో మార్పులు చేర్పులు చేయాలంటూ నివేదికలను రూపొందిస్తున్నారు.

# నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం!

మిర్యాలగూడ :మన దేశంలో ఎన్నికలప్పుడు ఓటు హక్కు వినియోగంపై ఓటరు చైతన్య కార్యక్రమాలుంటాయి. ఒకవేళ ఓటు హక్కును ఉపయోగించుకోకున్నా చర్యలు ఉండవు. కొన్ని దేశాల్లో మాత్రం ఈ పప్పులుడకవు. ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాల్సిందే. లేకుంటే జరిమానా విధిస్తారు. జైలు శిక్షా ఉంటుంది. ప్రభుత్వ పథకాల లబ్ధిపై అనర్హత వేటు పడుతుంది. ప్రభుత్వ ఉద్యోగులైతే వేతనాన్ని నిలిపేస్తారు. ఓటర్లలో చైతన్యం కోసమే దాదాపు 22 దేశాల్లో ఇలాంటి నిబంధనలు అమలవుతున్నాయి. ఇలాంటి చర్యలను మన దగ్గర అమల్లోకి తేలేదు. తెస్తే ఎక్కువగా విద్యావంతుల పైనే ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఆస్ట్రేలియాలో వివరణ తప్పదు ఓటు వేయని వారిని ఎన్నికల జ్యూరీ సంజాయిషీ కోరుతుంది. వివరణ సంతృప్తిగా లేకుంటే 20 నుంచి 50 డాలర్ల వరకు జరిమానా విధిస్తుంది. ఇక్కడ స్వచ్ఛంద ఓటింగ్ పద్ధతి ఉన్నప్పుడు ఓటింగ్ 47 శాతమే. నిబంధన కఠినం చేశారు. ఇప్పుడక్కడ ప్రతి స్థానిక ఎన్నికల్లో 91 నుంచి 95 శాతం వరకు ఓటింగ్ నమోదవుతోంది.

బ్రెజిల్, ఈక్వెడార్‌లో జరిమానా..

ఈ దేశాలకు చెందిన ఓటర్లు విదేశాల్లో ఉన్నా తప్పనిసరి స్వదేశానికి చేరాలి. ఓటు హక్కు వినియోగించుకోవాలి. లేనిపక్షంలో జరిమానా ఉంటుంది. ఈక్వెడార్‌లోనైతే వారి నెల ఆదాయంలో 10-15 శాతం జరిమానా విధిస్తారు.


గ్రీస్, ఈజిప్టుల్లోజైలు శిక్ష..

ఇక్కడి చట్టాలు కఠినం. 70 ఏళ్ల వయసున్న వారికీ మినహాయింపు ఉండదు. ఒక్కసారి ఓటు హక్కు వినియోగించకున్నా కోర్టు మెట్లెక్కాల్సిందే. వారు ఇచ్చే వివరణ సహేతుకంగా ఉండాలి. లేకుంటే నెల నుంచి ఏడాది వరకూ జైలు శిక్ష తప్పదు. ఇప్పటివరకు అక్కడ ఎవరికీ జైలుశిక్ష పడలేదు.అర్జెంటీనాలో పథకాలకు అనర్హులు 1912 నుంచే ఇక్కడ నిర్బంధ ఓటు హక్కు కొనసాగుతోంది.

18 నుంచి 70 ఏళ్ల వరకు తప్పనిసరిగా ఓటేయాలి. లేకుంటే వారికి 50 డాలర్ల జరిమానా. యేడాది పాటు ప్రభుత్వ పథకాల లబ్ధికి, స్థానిక అవకాశాలకూ అనర్హులే.

బెల్జియంలో ప్రభుత్వ ఉద్యోగం ఉండదు

ఇక్కడ కూడా వరుసగా నాలుగుసార్లు ఓటు హక్కు వినియోగించుకోకపోతే మరో పదేళ్లు ఓటు హక్కును కోల్పోతారు. ప్రభుత్వ ఉద్యోగ అర్హత ఉండదు. 2018లో ఇక్కడ ఓటింగ్‌లో పాల్గొనని వారు కేవలం 7.4 శాతమే.



పెరూలో డ్రైవింగ్ లైసెన్సు రద్దు

ఓటు హక్కు వినియోగించుకోకపోతే ఎలక్టోరల్ నేషనల్ జ్యూరీ చర్యలు తీసుకుంటుంది. ఆదాయం, ఓటరు స్థాయిని బట్టి భారీగా నగదు జరిమానా విధిస్తుంది. నోటీసులకు స్పందించకుంటే ఐటీ విభాగం రంగంలోకి దిగుతుంది. డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తారు.

ఎమ్మెల్యే పేరుతో రాష్ట్ర కార్యాలయం

హుజూర్‌నగర్ నియోజకవర్గం 1952లో ఏర్పడగా.. తొలి ఎన్నికల్లో సరోజిని నాయుడు కుమారుడు ముత్యాల జయసూర్య నాయుడు పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయన మెదక్ లోక్‌సభ స్థానం నుంచి కూడా విజయం సాధించడంతో.. హుజూర్‌నగర్ శాసనసభ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ వచ్చిన ఉప ఎన్నికలో మెదక్ జిల్లాకు చెందిన ప్రముఖ ఉర్దూ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, వామపక్ష నాయకుడు మగ్దూం మోహియుద్దీన్ పోటీ చేసి గెలుపొందారు. కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ శాఖ తొలి కార్యదర్శిగా పని చేసిన ఆయన పేరుతోనే హిమాయత్‌నగర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యాలయం ఏర్పాటయింది. ప్రస్తుతం ఆ భవనాన్నే మగ్దూం భవన్‌గా పిలుస్తున్నారు.

# ఎన్నికల పండగ.. ఉపాధి దండిగా

నాగర్‌కర్నూల్ : రాష్ట్రంలో అయిదేళ్లకోసారి జరిగే ఎన్నికల పండగ మళ్లీ వచ్చింది. పోటీ చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు, తిరుగుబాటు అభ్యర్థులు సమాయాత్తమవుతున్నారు. అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడటంలేదు. ఎంతైనా ఫర్వాలేదనే స్థాయిలో ఉన్నారు. వీళ్ల ఖర్చుల మాట ఎలా ఉన్నా పలురంగాల్లో చాలామందికి ఉపాధి లభిస్తోంది. ఒక ప్రాంతం నుంచి మరోచోటికి ప్రచార కార్యక్రమాలకు వెళ్లే యువకులకు ఈ సీజన్‌లో ఒక్కొక్కరికి రూ. 20 నుంచి 25 వేల వరకు గుడ్‌విల్ రూపంలో దక్కుతోంది..

పూల రైతులు... అమ్మకందారులు

పోటీలో ఉన్న అభ్యర్థులు, నాయకులు కార్యకర్తల సమావేశాలు, ప్రచారాల కోసం గ్రామాలకు వస్తున్నారు. వీరికి స్వాగతం పలికేందుకు పూలదండలు, చల్లేందుకు పూలు అవసరం పడుతున్నాయి. దీంతో పూల తోటల పెంపకందారులు, అమ్మకందారులకు గిరాకీ పెరిగింది. సాధారణంగా దసరా, దీపావళిలకు పూలకు డిమాండు ఉంటుంది. ఈ రెండింటి మధ్య ఎన్నికల పండగ రావడంతో మరింత గిరాకీ పెరిగింది. కిలోకు రూ.వంద నుంచి 150 వరకు పలికే చామంతి రెండొందలు, ఆ పై అమ్మకం అవుతోంది. రూ.200 వరకు పలికే గులాబీ రూ. 350, రూ.30 పలికే బంతి పూలు రూ. 60 దాకా పలుకుతున్నాయి, ఒక గ్రామ ప్రచారానికి అభ్యర్థి వస్తే రూ. అయిదు వేల వరకు పూల కోసమే ఖర్చు చేస్తున్నారు. వీటితో పాటు టపాసులకు గిరాకీ పెరిగింది. ప్రచారానికి వచ్చే నాయకులకు టపాసులతో స్వాగతం పలుకుతున్నారు.

బ్యాండు మేళాలకు..



ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులకు ఊరి బయటి నుంచి బ్యాండు మేళాలు, తప్పెట్లతో స్వాగతం పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో వాయిద్య బృందాలకు ఈ నెల అసాంతం పని లభిస్తోంది. ఊరేగింపులో పాల్గొన్న ప్రతి వాయిద్యకారుడికి పూటకు కనీసం రూ. అయిదు వందలు దక్కనున్నాయి. పెళ్లిళ్ల సీజన్ మొదలైన తరుణంలోనే ఎన్నికల పండగ మొదలు కావడంతో వాయిద్యకారులకు ఎనలేని డిమాండు నెలకొంది.

వాహనదారులకు..

ప్రచారానికి అద్దె వాహనాలు అవసరం పడుతున్నాయి. ఎన్నికల ముందు వరకు గిరాకీలు లేక ఇబ్బందులు పడ్డ అద్దె వాహనదారులకు ఇపుడు చేతినిండా పని లభించింది. ముఖ్యంగా ప్రచారానికి, నాయకుల తరలింపునకు వాహనాలు అవసరం పడుతున్నాయి. వీరందరూ ఈ నెలాఖరుదాకా తీరిక లేకుండా వాహనాలు నడుపుతున్నారు. కొంతమంది ఎన్నికలయ్యేవరకు పూర్తిగా ప్యాకేజీ మాట్లాడుకుంటున్నారు. .

టెంట్ హౌస్‌లకు..

అభ్యర్థులు వస్తున్నారంటే గ్రామాలలో టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ప్రస్తుతం పట్టణాల్లో అయితే ఒక కుర్చీకి రూ. పది గ్రామాలలో అయితే రూ. ఆరు నుంచి ఎనిమిది దాకా వసూలు చేస్తున్నారు. ప్రధాన నాయకులు వస్తే మహారాజా కుర్చీలు అవసరం పడుతున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో టెంట్ హౌస్ నిర్వాహకులు దండిగా డబ్బులు సంపాదిస్తున్నారు. వీరితోపాటు ప్రింటింగ్ ప్రెస్‌లు, ఫ్లెక్సీలు, జెండాలు తయారు చేసేవారికి డిమాండు ఉంటోంది.

ఆహారానికి భలే గిరాకీ

ఎన్నికల ప్రచారంలో అల్పాహారమైన ఉగ్రాని(ఉగ్గాని, కర్ణాటక బిర్యాని, సుశీల)కి ఓ ప్రత్యేకత ఉంది. దీన్ని బొనుగులు (మరమరాలు)తో సులభంగా తయారు చేస్తారు. ఇది తింటే మధ్యాహ్నం వరకు ఆకలివేయదు. వివిధ పార్టీల స్థానిక నాయకులు తయారీదారులకు టోకు ఆర్డర్లు ఇచ్చారు. దీంతో పాటు మధ్యాహ్న భోజనం తయారీకి వంట మనషులతో పాటు కూలీలకు ఉపాధి లభిస్తోంది. ప్రధాన పార్టీలు ఫంక్షన్ హాళ్లలో బూత్ కమిటీలు, విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నాయి. వచ్చే కార్యకర్తలకు చికెన్ కూరతో భోజనం వడ్డిస్తున్నారు. ప్రస్తుతం భోజనం తయారీదారులకు గిరాకీ బాగుంది. అంతే కాకుండా కూలీలకు పని దొరకుతోంది. చికెన్ సరఫరాదారులు తీరిక లేకుండా ఉంది. గతంలో కన్నా 50 శాతం అదనంగా అమ్మకాలు పెరిగాయని నారాయణపేటలోని ఓ మాంసం దుకాణదారుడు చెబుతున్నారు.

రచయితలు, కళాకారులు..

పెరిగిన సాంకేతికతతో ఎన్నికల ప్రచారం కొత్త పుంతల్ని తొక్కుతున్నది. రచయితలు అభ్యర్థుల గుణగణాలకు కీర్తిస్తూ పాటలు రచిస్తున్నారు. కళాకారులు ఈ పాటలను పాడుతూ నృత్యాలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఒక్కొక్క కళాకారుడికి రోజుకు రూ.1000 వరకు పారితోషకం రూపేణా లభిస్తోంది.

## మిల్లర్లు కోతలు విధిస్తే సహించం : కలెక్టర్

పెద్దపల్లి : జిల్లాలో ధాన్యం సేకరణలో మిల్లర్లు కోతలు విధిస్తే సహించేది లేదని కలెక్టర్ ముజామిల్‌ఖాన్ తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, ప్యాడీక్లీనర్లు, తేమ శాతం పరిశీలించే పరికరాలు, గన్నీ సంచులు ఇతర మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. జిల్లాలో 305 కేంద్రాలు ప్రతిపాదించగా ఇప్పటి వరకు 57 కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. రెండు రోజుల్లో అన్ని చోట్ల ధాన్యం సేకరణ మొదలుపెట్టాలన్నారు. నాణ్యత ప్రమాణాలపై రైతులు అవగాహన కల్పించాలన్నారు. వాహనాల్లో సామర్థ్యానికి మించి ధాన్యం రవాణా చేయరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల తదితరులు పాల్గొన్నారు.

**ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలి** జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో మానిటరింగ్ సెల్‌ను సందర్శించి ఫిర్యాదుల వివరాలపై ఆరా తీశారు. సీ-విజిల్, 1950 టోల్ ఫ్రీ నంబర్‌లో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న, రెచ్చగొట్టే సందేహాలను స్వీకరించాలన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

# అన్నదానం.. విస్తరిస్తేనే ఉపయుక్తం

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని సాధారణ రోజుల్లో సగటున ఐదారు వేల మంది భక్తులు దర్శించుకుంటారు. శని, ఆదివారాల్లో ఆ సంఖ్య 20వేలకు చేరుకుంటుంది. ఉదయం 10 గంటల నుంచి దాదాపు అర గంట సేపు ఆలయం వద్ద భోజన టోకెన్లు అందిస్తుంటారు. ఈ టోకెన్లు ఉంటే ఉచితంగా భోజనం చేయొచ్చు. కాస్త ఆలస్యంగా వచ్చిన వారికి అన్నప్రసాదం అందడం లేదు. సుదీర్ఘ కాలం నుంచి ఈ సమస్య వేధిస్తోంది. పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు. స్వామివారి దర్శనానికి ఎంతమంది వచ్చినా అన్నదానం చేయాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చటం లేదు.

నిధులు పుష్కలం

అన్నదానం పద్దు కింద బ్యాంకులో రూ.40 కోట్ల నిధులున్నాయి. నెలకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు సమకూరుతుండగా ఏడాదికి రూ.కోటికి తగ్గకుండా విరాళం సమకూరుతోంది. కోవెల ప్రాంగణంలో 2014 నవంబర్‌లో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఆ ఒక్క నెలలోనే రూ.6.5 లక్షలు వచ్చాయి. పదేళ్లలో హెల్ప్‌డెస్క్ నుంచి రూ.10 కోట్ల విరాళాలు అందాయి. అన్నదానానికే ఎక్కువ మొత్తంలో సమకూరాయి. నిధులు పుష్కలంగా ఉండటంతో రోజుకు 2 వేల మందికి భోజనం వడ్డించే అవకాశముంది. అన్నం, కూర, పప్పు, సాంబారు, మజ్జిగ, పచ్చడి, స్వీట్ తదితరాలను



వడ్డిస్తున్నారు. ఒక్కో భోజనానికి రూ.40 ఖర్చవుతున్నట్లు అంచనా. ప్రస్తుతం 600- 1,300 మందికి నిత్యం భోజనం వడ్డిస్తున్నారు. అన్నదాన సత్రం అవసరాల నిమిత్తం రోజుకు ఒక సిలిండర్ గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. ఖర్చు తగ్గించేందుకు ఐటీసీ సాయంతో బయోగ్యాస్ యూనిట్ ఏర్పాటు చేసినా ఆశించిన స్థాయిలో ఉపయోగపడట్లేదు. ఆవు పేడ, మిగిలిపోయిన అన్నం, సాంబారు వంటి ఆహార పదార్థాలను ముడిసరకుగా వాడి రోజుకు పది కిలోల లోపు బయోగ్యాస్‌ను తయారు చేస్తున్నారు. దీన్నీ విస్తరించాల్సిన అవసరం ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరతభోజనశాలలో వంట చేసే వారితో పాటు వడ్డించే వారి సంఖ్య పెంచాలి. నిత్యం ఇక్కడ రద్దీ నెలకొంటుంది. గతంలో 12 మంది పనిచేసిన చోట ఇప్పుడు ఎనిమిది మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల లడ్డూ తయారీ హక్కులను గుత్తేదారు నుంచి తప్పించడంతో అక్కడా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో అన్నదానం విభాగంలో పనిచేసే ఇద్దరిని ప్రసాదాల తయారీ యూనిట్‌కు కేటాయించారు. ఫలితంగా భోజనశాలలో ఆరుగురిపై పనిఒత్తిడి అధికమైంది.

# ఉపాధిహామీ కూలీలకు సౌకర్యాలేవీ ?

జనగామ : గ్రామీణ ప్రాంతాల్లో పేదల వలసలను నివారించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 2005లో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. కూలీలకు ఏడాదిలో 100 రోజులు పనులు కల్పించడంతో పాటు.. పని ప్రదేశాల్లో ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు గుడారాలు, ప్రథమ చికిత్స, తాగునీరు, పనిముట్లకు డబ్బుల చెల్లింపు, వేసవి భత్యం వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. 2005 నుంచి 2022 వరకు ఇవి సక్రమంగానే అమలయ్యాయి. గత రెండేళ్లుగా వీటిని అమలు చేయకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో గ్రామీణ ప్రాంత జనాభా అధికంగా ఉంది. వ్యవసాయ రంగం తర్వాతి స్థానం ఉపాధి హామీ కూలీలదే. సాధారణంగా మార్చి నుంచి జూన్ వరకు కూలీల హాజరు ఎక్కువగా ఉంటుంది. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 281 గ్రామాలుండగా.. ఉపాధిహామీ పనుల ఆవాసాలు 450 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,17,504 జాబ్ కార్డులు ఉండగా.. 2,35,836 మంది కూలీలు ఉన్నారు. జిల్లాలో సగటున 45 వేల మంది కూలీలు హాజరవుతారు. ప్రస్తుతం వరి కోతలు, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో 34 వేల మంది కూలీలు మాత్రమే హాజరవుతున్నారు.

వసతులు కరవు..ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు నీడ కల్పించేందుకు గుడారాలు, గాయపడితే ప్రథమ చికిత్స కిట్లు, దాహార్తి తీర్చేందుకు తాగునీటి సౌకర్యం కల్పించడం లేదు. గతంలో వేసవిలో.. కూలీలకు 30 శాతం అదనపు భత్యం చెల్లించేవారు. గడ్డపారకు రోజుకు రూ.10, పార, తట్టకు రూ.5 చొప్పున అందించేవారు. ప్రస్తుతం ఇవేవీ ఇవ్వడం లేదు.

పనిముట్లకు డబ్బులు ఇవ్వడం లేదు-బోయిని అనిత, వడ్లకొండ, జనగామ మండలం

ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీలకు అవసరమైన గడ్డపార, పార, తట్టలకు ప్రభుత్వం డబ్బులు ఇచ్చేది. ప్రస్తుతం గడ్డపారకు పదును పెట్టేందుకు రూ.100 ఖర్చవుతోంది. గడ్డపార, పార, తట్టలకు రోజు వారీగా డబ్బులు చెల్లించేవారు. వేసవి భత్యం 30 శాతం ఇచ్చేది. ప్రస్తుతం వీటన్నింటికీ డబ్బుల చెల్లింపు నిలిపివేశారు.

ఎండలకు అల్లాడిపోతున్నాం-గౌరగల్ల మహేశ్వరి, వడ్లకొండ

వేసవిలో ఎండల్లో పని చేసేందుకు అల్లాడిపోతున్నాం. మార్చి నుంచి జూన్ వరకు.. ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలి. అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదు. వడదెబ్బతో ప్రాణాలు పోయేలా ఉన్నాయి. కూలీలకు గతంలో కల్పించిన సౌకర్యాలను పునరుద్ధరించాలి.

కూలీలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు-గూడూరు రాంరెడ్డి, డీఆర్డీవో

పంచాయతీ పాలకవర్గం సహకారంతో.. ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు తాత్కాలికంగా షెడ్లు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేసేలా.. రోజు వారీ వేతనం కనీసం రూ.250 అందించాలని మండల, గ్రామ, క్లస్టర్ అధికారులను ఆదేశించాం. వేసవి భత్యం, పనిముట్లకు డబ్బుల చెల్లింపు, ప్రథమ చికిత్స కిట్లు తదితర సౌకర్యాలను ప్రభుత్వం ప్రస్తుతం నిలిపివేసింది.

# ఆన్‌లైన్‌లో చిన్నారి లోకం




మణుగూరు : మనం తలదించుకుని పుస్తకాన్ని చదివితే.. ఆ పుస్తకం మనల్ని తల ఎత్తుకునేలా చేస్తుంది. పుస్తకాలకు ఎక్కడైనా, ఎప్పుడైనా ఎంతో విలువ ఉంటుంది. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, నైతిక విలువలు, జీవన విధానం ఇవన్నీ మన కళ్లకు కట్టినట్లు అనేక పుస్తకాలు అవగాహన కల్పిస్తాయి. సంవత్సరం పొడవునా పాఠాలు, పరీక్షలతో తలమునకలయ్యే చిన్నారులకు వేసవి సెలవులు ఎంతో ఊరటనిస్తాయి. ఈ సమయంలో ప్రాపంచిక జ్ఞానాన్ని అందిస్తే వారిలో విలువల పెంపునకు మార్గం వేసినట్టే. ఒక స్థాయి పట్టణాలు మినహా చాలాచోట్ల గ్రంథాలయాలు అందుబాటులో లేవు. అలాంటి సందర్భాల్లో స్వీయ పర్యవేక్షణలో తల్లిదండ్రులు అంతర్జాల సేవలను ఉపయోగించుకొని కంప్యూటర్, సెల్‌ఫోన్ సాయంతో జ్ఞానాన్ని పెంపొందించుకునేలా పిల్లలను ప్రోత్సహించవచ్చు. నీతి కథలు, ఇతిహాసాలు, మహనీయుల జీవిత చరిత్రలతో కూడిన పుస్తకాలను ఆన్‌లైన్‌లో పిల్లలతో చదివించేందుకు శ్రద్ధ తీసుకోవాలి. కథలు యానిమేటెడ్ చిత్రాలతో చిన్నారులను కట్టిపడేస్తాయి. బొమ్మలతో కూడిన కథలను వద్దన్నా చదివేందుకు పిల్లలు ఆసక్తి చూపుతారు.

తెలుగురైమ్స్.కామ్తెలుగురైమ్స్.కామ్ అనే వెబ్‌సైట్‌లో పెద్దలనూ చదివించే పంచతంత్ర కథలు, తెలుగు వీడియో కథలు, క్విజ్ ఉండటం విశేషం. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించే పలు రకాల స్టోరీలు ఉంటాయి. వీరివీరి గుమ్మడి పండు, చిట్టి చిలకమ్మా, దాగుడు మూతల దండాకోర్ తదితర అనేక రకాల వీడియోలను చిన్నారులు చూస్తే ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తారు.

కథలు. వర్డ్‌ప్రెస్.ఇన్

భారతీయ సంస్కృతికి అద్దంపట్టే కథలు ఈ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. ఇందులో ఇతిహాసాలు, ప్రబంధాలు, కవితలతోపాటు భక్తి, నీతి కథలు పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంటాయి. గతంలో పిల్లలకు తాతమ్మలు, అమ్మమ్మలు, నానమ్మలు ఒడిలో పడుకోబెట్టుకొని పలు నీతికథలు వినిపించేవారు. ఆ కథల్లోని సారాంశం చిన్నారులపై ఎంతో ప్రభావం చూపేది. వాటిని వినడం వల్లనే ఎందరో మహనీయులుగా ఎదిగిన ఉదంతాలున్నాయి.

చందమామ.ఇన్

కథల ప్రపంచంలో చందమామ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఎన్నో రకాల పుస్తకాలు పాఠకులకు అందుబాటులోకి వచ్చినా దీనికి ఉన్న ప్రాధాన్యం నేటికీ తగ్గలేదు. పిల్లలకు సంబంధించిన అనేక రకాల కథలు, జానపద సాహిత్యం, హాస్యం, తెలుగు భాషాభివృద్ధికి దోహదం చేసే వివిధ రకాల స్టోరీలు చందమామ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. తెలుగుతోపాటు ఆంగ్లం, హిందీ, సంస్కృతం తదితర భాషల్లో అందుబాటులో ఉండటం విశేషం. చందమామ పుస్తకాలు, పాత సంచికలు కూడా ఈ సైట్‌లో చూసుకునే వెసులుబాటు ఉంది. జానపద, అక్బర్, బీర్బల్ కథలు, చందమామ జ్ఞాపకాలతో పురాణాలు, ఇతిహాసాలు, లోకజ్ఞానం ముఖ్యంగా భేతాళ కథలు పాఠకులను అలరిస్తాయి.

మ్యాజిక్‌కీస్.కామ్

అంతర్జాలం సాయంతో ఈ వెబ్‌సైట్‌లో చిల్డ్రన్ స్టోరీ బుక్‌లోకి లాగిన్ అవ్వాలి. ఇందులో యానిమేషన్‌తో కూడిన కథలుంటాయి. చిట్టిపొట్టి కథల పుస్తకాలతోపాటు మనకు కావాల్సిన వివిధ రకాల బుక్స్ కొనుగోలుకు అవకాశం ఉంది. ఆడియో ద్వారా ఆకట్టుకునే కథలు ఈ వెబ్‌సైట్‌లో ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి. ఇవేకాకుండా కార్టూన్ స్టోరీలు, సాహస గాథలు అందుబాటులో ఉన్నాయి.

మంచిపుస్తకం.ఇన్

వివిధ రకాల బొమ్మలతో చిన్నారులను మంచిపుస్తకం.ఇన్ అనే వెబ్‌సైట్ ఎంతగానో ఆకట్టుకుంటుంది. పరమానందయ్య శిష్యుల కథలు, చిట్టి చిలకమ్మా, పేదరాసి పెద్దమ్మ, చిన్నారి చిట్టి కథలు ఈ వెబ్‌సైట్‌లో దర్శనమిస్తాయి. అరేబియన్ నైట్స్ తదితర కథలు పిల్లలు విశేషంగా ఇష్టపడుతుంటారు. చిన్నారులతోపాటు పెద్దవారినీ ఆకట్టుకునేలా పలు రకాల క్విజ్ పోటీలను ఈ సైట్‌లో పొందుపరిచారు. ఈ కథలను చదవడం ద్వారా పిల్లల్లో నైతిక విలువలతోపాటు పఠనాసక్తిని పెరిగే అవకాశం ఉంటుంది.కథల అభ్యసనంతో చిన్నారుల్లో భాషపై పట్టు పెరగడంతోపాటు జ్ఞానం పెరుగుతుంది. పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతుండటంతో పిల్లలకు పురాణాలు, ఇతిహాసాలు, మహనీయుల జీవిత చరిత్రలపై కనీస పరిజ్ఞానం ఉండటం లేదు. అంతర్జాలంలో వెబ్‌సైట్‌లను ఉపయోగించుకుని కథలు, పద్యాలు, పురాణాలు చదివిస్తే విజ్ఞానంతో పాటు తప్పులు లేకుండా రాయడం, చదవడం అలవర్చుకుంటారు.స్రవంతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మణుగూరు

# 9 ఏరియాలు..240 మెగావాట్లు



కొత్తగూడెం : సింగరేణి వ్యాప్తంగా రెండో దశ సౌర విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతానికి నెల క్రితం యాజమాన్యం ఆదేశించింది. దీంతో వెంటనే ఏరియాల వారీగా అధికారులు స్థలాన్వేషణ కొనసాగించారు. అందుబాటులోనున్న ఖాళీ ప్రదేశాలు గుర్తించారు. స్థలాల్ని బట్టి ఎంత సామర్థ్యం గల యూనిట్లు ఏర్పాటు చేయవచ్చో ఈ అండ్ ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు నివేదిక రూపొందించారు. దాన్ని హైదరాబాద్‌లో ఈ నెల 5న సీఎండీకి సమర్పించారు. దీని ప్రకారం ఏఏ ఏరియాలో కొత్తగా సౌర ప్లాంట్లు, ఎంత సామర్థ్యంతో నిర్మించనున్నారో ఓ స్పష్టత వచ్చింది.ఎక్కడెక్కడ.. ఎంత స్థలం? కొత్తగూడెం ఏరియాలో సత్తుపల్లి వద్ద ఒకేచోట 35 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు చేసేలా స్థలం గుర్తించారు. మందమర్రి ఏరియాలో పలు గనులు, కాలనీల వద్ద అందుబాటులోనున్న స్థలాల్లో ఐదు ప్లాంట్లు నిర్మించే యోచన ఉంది. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం వద్ద పెద్ద మొత్తంలో స్థలం ఉంది. రామగుండం-3 ఏరియాలో రెండు ప్రాంతాల్లో సుమారు 20 మెగావాట్ల సామర్థ్యంతో రెండు ప్లాంట్లు నెలకొల్పనున్నారు. రామగుండం-1 పరిధిలో పాత పవర్‌హౌస్ ప్రాంతంలో ఖాళీ భూములు గుర్తించారు. ఇల్లెందు ప్రాంతంలో ఇప్పుడు నిర్మించిన సౌర ప్లాంటు పక్కనే కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించినట్లు డైరెక్టర్ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. 'సౌర విజన్'.. 2024..వచ్చే రెండేళ్లలో సొంత సౌర విద్యుత్తుతో నడిచే తొలి బొగ్గు కంపెనీగా నిలిచేందుకు సింగరేణి ప్రణాళికలు రూపొందిస్తోంది.

సంస్థ ప్రస్తుతం ఏటా 750 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తోంది. తొలి దశలో 300 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంతో రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 224 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లు పూర్తిచేసి.. సాలీనా 350 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి కొనసాగిస్తోంది. ఈ ఏడాది జూన్‌లోగా మిగిలిన ప్లాంట్లు (మొత్తం 76 మెగావాట్ల సామర్థ్యం) పూర్తిచేస్తే మరో 120 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని అంచనా. ఇవి కాకుండా 2024 నాటికి కొత్తగా 240 యూనిట్ల సామర్థ్యంతో ప్లాంట్లు పూర్తిచేసే యోచనలో ఉంది. వీటికి త్వరలో అనుమతి లభించనుంది.

# వాహనాల గజిబిజి.. రహదారి రక్తమోడి

ఖమ్మం : ఖమ్మం నగరానికి మూడువైపులా ఉన్న రహదారులను విస్తరించి డివైడర్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఖమ్మం గ్రామీణ మండలంలో రహదారులు విస్తరించారు. కానీ మధ్యలో డివైడర్లు నిర్మించకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఖమ్మం నగరానికి పశ్చిమం వైపున ఖమ్మం గ్రామీణ మండలం ఉంది. ఈ మండలం నుంచి ఖమ్మం-సూర్యాపేట, ఖమ్మం-కోదాడ, ఖమ్మం-కురవి, ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వీటితోపాటు నూతనంగా ఖమ్మం-దేవరపల్లి, నాగపూర్-ఖమ్మం-అమరావతి జాతీయ రహదారులు కూడా నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ రహదారులపై వాహనాల రద్దీ ఎక్కువ, దానికి అనుగుణంగానే రహదారులను విస్తరించారు. కానీ డివైడర్లు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాల నివారణకు పోలీసులు మధ్యమధ్యలో తాత్కాలిక డివైడర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రహదారుల్లో వారం, పది రోజులకో ప్రమాదం జరుగుతూనే ఉంది. ఖమ్మం-ఇల్లెందు రహదారిలో రఘునాథపాలెం వరకు రోడ్డు విస్తరణతో పాటు డివైడర్లు ఏర్పాటు చేశారు. వైరారోడ్డులో రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం వరకు, బోనకల్లు రోడ్డులో అగ్రహారం రైల్వే వంతెన వరకు డివైడర్లు ఉన్నాయి. మూడువైపులా డివైడర్లతో కూడిన రహదారులు ఉన్నప్పటికీ ఖమ్మం గ్రామీణ మండలంలో మాత్రం వివక్ష కొనసాగుతుంది. పాలేరు నియోజకవర్గంలో కూసుమంచి, నేలకొండపల్లి మండల కేంద్రాల్లో గ్రామం మధ్య నుంచి



గ్రామం చివరి వరకు డివైడర్లు ఉన్నాయి. ప్రస్తుతం జలగంనగర్ నుంచి మద్దులపల్లి వరకు నాలుగు వరుసలుగా రహదారి విస్తరించారు. త్వరలో జాతీయ రహదారుల కూడలిగా మారనున్న పొన్నెకల్లు వరకు ఈ రహదారిని విస్తరించనున్నారు. ఈ మార్గంలో జలగంనగర్ నుంచి పొన్నెకల్లు జంక్షన్ వరకు రహదారి మధ్యలో డివైడర్లు నిర్మించాల్సి ఉంది. వీటితోపాటు వరంగల్ రోడ్డులో కరుణగిరి నుంచి ఏదులాపురం వరకు డివైడర్ల అవసరం ఎంతైనా ఉంది.ప్రతిపాదనలు పంపించాం..శ్రీకాంత్, ఏఈఈ ర.భ.శాఖ

జలగంనగర్ నుంచి మద్దులపల్లి వరకు రహదారి మధ్యలో డివైడర్లు నిర్మించాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

# ధాన్యం కోత.. రైతుల వెత!

మహబూబాబాద్ : ఇక్కడ తూకం యంత్రంలో 41.150 కిలోలు చూపిస్తున్నది పెద్దవంగర మండలం రామచంద్రుతండాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలోనిది. నిబంధనల ప్రకారం బరువును కలిపి ఒక్కో బస్తాను 40.700 కిలోలు తూకం వేయాలి. నిర్వాహకులు ఒక్కో బస్తాను 41.150 చొప్పున తూకం వేస్తున్నారు. ఒక బస్తాకు 450 గ్రాముల చొప్పున అధికంగా కాంటా పెడుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రక్‌షీట్ పెద్దవంగరలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఆధ్వర్యంలో రైతుల నుంచి యాసంగి ధాన్యం కాంటాలు వేసిన తర్వాత మిల్లుకు తరలించేందుకు రాసింది. గత నెల 27న అయిదుగురు రైతులకు చెందిన రూ.5.36 లక్షల విలువ చేసే 651 బస్తాల్లోని 260.40 క్వింటాళ్ల ధాన్యాన్ని తొర్రూరులోని ఓ ధాన్యం మిల్లుకు పంపించారు. అక్కడి నిర్వాహకులు కొర్రీలు పెడుతూ ఇందులో నుంచి రూ.9,888 విలువైన 4.8 క్వింటాళ్ల ధాన్యమున్న 12 బస్తాలను కోత పెట్టి 639 బస్తాలకు లెక్కగట్టి ట్రక్‌షీట్ తిరిగి కొనుగోలు నిర్వాహకులకు పంపించారు.జిల్లాలో యాసంగి ధాన్యం విక్రయించడంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పలువురు మిల్లర్లు ఇష్టారాజ్యంగా ధాన్యంలో కోత పెడుతున్నారని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం అడ్డగోలుగా తూకాలు చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం సేకరణకు జిల్లా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం 144 కేంద్రాలు ప్రారంభమై తూకాలు అవుతున్నాయి. ఇప్పటి వరకు ఆరు వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వీటిని జిల్లాలోని పది మిల్లులకు పంపిస్తున్నారు. నాణ్యతతో కూడిన ధాన్యాన్ని పంపిస్తే మిల్లర్లు ఆదిలోనే తమను ప్రశ్నించే వారు లేరంటూ కొర్రీలు పెడుతూ అడ్డంగా దోచుకుంటున్నారు. పెద్దవంగరలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు 655 బస్తాల లోడును పంపిస్తే మిల్లరు 11 బస్తాలను కోత పెట్టారు. మిల్లుల నుంచి తిరిగి కేంద్రాలకు వస్తున్న ట్రక్‌షీట్లను చూసి అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఇనుగుర్తి మండలం చిన్ననాగారం కొనుగోలు కేంద్రం నుంచి 600 బస్తాల లోడ్‌తో లారీ కేసముద్రంలోని ఓ మిల్లుకు తరలించగా యజమాని 'ధాన్యం తడిసిందంటూ దిగుమతి చేసుకునేందుకు కొర్రీలు పెట్టారు. వెంటనే నిర్వాహకులు అక్కడికి వెళ్లి ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని తీసుకుంటామని చెప్పిందని వాదించడంతో దిగుమతి చేసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. మిల్లర్లు, నిర్వాహకుల మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం వల్లనే దోపిడీకి గురవుతున్నామని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

అడ్డగోలుగా తూకాలుపీఏసీఎస్ కేంద్రాల్లోనే కాదు ఐకేపీ కేంద్రాల్లోనూ అడ్డగోలుగా తూకాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 40.700 కిలోల చొప్పున తూకం వేయాల్సి ఉన్నా కొన్ని ప్రాంతాల్లో 41 నుంచి 41.150 కిలోల చొప్పున తూకం వేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. నిర్వాహకులు మిల్లుకు బస్తాలను పంపించే సమయంలో 40 కిలోల చొప్పున లెక్కగట్టి ట్రక్‌షీట్ రాసి పంపిస్తున్నారు. అందులో బస్తా బరువు 700 గ్రాములు పోనూ అడ్డగోలుగా తూకం వేసిన ధాన్యం నిర్వాహకుల ఖాతాలో పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులు దృష్టి సారిస్తేనే

ఇప్పటికే అకాల వర్షాలతో దిగుబడుల తగ్గాయని..దానికి తోడు కలాల్లో, కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి మొలకెత్తి నష్టపోతున్నామని రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ నష్టానికి తోడు కేంద్రాల్లోని నిర్వాహకులు అధికంగా తూకం వేయడం..మిల్లర్లు సాకులు చెబుతూ కోతలు పెట్టడం మరింత నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే తమకు లాభం చేకూరుతుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం-కృష్ణవేణి, పౌరసరఫరాల శాఖ మేనేజర్, మహబూబాబాద్

మిల్లర్లు నాణ్యత సాకుతో క్వింటాళ్ల కొద్దీ కోత విధించడం, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అధికంగా తూకం వేస్తున్నట్లు ఇప్పటి వరకు మాకు ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం.నష్టం జరగకుండా చూడాలి- ఎడవెల్లి మహేష్‌రెడ్డి, పెద్దవంగర, రైతు

పెద్దవంగర: నేను 8 ఎకరాల్లో వరి సాగు చేశాను. సుమారు 150 క్వింటాళ్ల ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. కాంటా అయిన తర్వాత నాతో పాటు మరో నలుగురికి చెందిన బస్తాలతో కూడిన లారీని తొర్రూరులోని మిల్లుకు పంపిస్తే వారు పలు కారణాలు చూపుతూ లారీలోని 12 బస్తాల తరుగు తీశారు. దీంతో సుమారు రూ. 10 వేలు నష్టపోయాం. అధికారులు స్పందించి నష్టం జరగకుండా చూడాలి. 41.150 కిలోల చొప్పున తూకం వేస్తున్నారు-కూతురు సతీష్, పెద్దవంగర, రైతు

పెద్దవంగర: పది ఎకరాల్లో వరి సాగు చేశాను. ఇటీవల వడగళ్ల వానకు ధాన్యం రాలిపోయింది. చేతికొచ్చిన 455 బస్తాల ధాన్యాన్ని ఐకేపీ కేంద్రంలో విక్రయించా. నిబంధనల ప్రకారం ఒక్కో బస్తా 40.700 కిలోలు కాంటా వేయాల్సి ఉండగా 41.150 కిలోలు వేస్తున్నారు. ప్రశ్నిస్తే ఎండాకాలం బరువు తగ్గుతుందని చెబుతున్నారు. కేంద్రం నిర్వాహకులు, మిల్లు యజమానులు కలిసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

# భారాసలో భగ్గుమన్న వర్గ విభేదాలు

వరంగల్: హనుమకొండ జిల్లా కమలాపూర్ భారాసలో వర్గ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. సాక్షాత్తు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలోనే ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో భారాస ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా కమలాపూర్ మండలం సమావేశం వంగపల్లి క్రాస్‌రోడ్డులోని ఓ నాయకుడి గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో జరిగింది. సమావేశంలో ముఖ్య నాయకుడు మాట్లాడుతూ.. కొద్ది మంది నాయకులు కోవర్టులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. మరో నాయకుడు లేచి వాళ్లు ఎవరో బయటపెట్టాలని ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఒక్కసారిగా సమావేశం రసాభాసగా మారింది. కొందరు భారాస కార్యకర్తలు ఫొటోలు తీస్తుండగా ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, ఇతర నాయకులు డిలిట్ చేయాలని హెచ్చరించినట్లు తెలిసింది. ముఖ్య నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ సమావేశం నుంచి బయటికి వెళ్లిపోయారు. కౌశిక్ రెడ్డి సైతం మళ్లీ సమావేశమవుదామని చెప్పి ఆగ్రహంతో వెళ్లిపోయారు. ఇటీవల వర్గ విభేదాలతో కమలాపూర్ మండల సర్పంచుల ఫోరానికి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. గతంలో ఉన్నవారిని కాదని కొత్తగా ఎన్నుకోవడంపై సీనియర్లు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ దగ్గరికి వెళ్లి తమ ఆక్రోశాన్ని తెలిపినట్లు తెలిసింది. భారాస మండల అధ్యక్ష పదవి, కమలాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవుల విషయంలోనూ చాలా రోజులుగా భారాసలో అసమ్మతి రాగం వినిపిస్తోంది.



# అప్పటి వరకు చంద్రబాబును అరెస్ట్ చేయొద్దు

దిల్లీ: ఫైబర్ నెట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు లో విచారణ వాయిదా పడింది. ఈనెల 30న విచారణ చేపడతామని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం తెలిపింది. ఏపీ సీఐడీ పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీం.. ఫైబర్‌నెట్ కేసులో ఈనెల 30 వరకు చంద్రబాబును అరెస్ట్ చేయొద్దని ఆదేశించింది. మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తీర్పును దీపావళి సెలవుల తర్వాత వెల్లడిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. సెక్షన్ 17ఏ నిబంధన ఈ కేసులోనూ ఉన్నందున స్కిల్ కేసు తీర్పు వచ్చాక విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కేసు ముగిసేవరకూ అరెస్ట్ చేయబోమన్న నిబంధన కొనసాగించాలని చంద్రబాబు తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లగా.. గత హామీ మేరకే ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు తెలిపారు.

కేసు విచారణను ఈనెల 23కి వాయిదా వేయాలని తొలుత ధర్మాసనం నిర్ణయించింది. అయితే సిద్ధార్థ లూథ్రా విజ్ఞప్తి మేరకు విచారణను సుప్రీంకోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది.



# నూతన వధూవరులకు సీఎం వైయస్ జగన్ ఆశీర్వాదం

అన్నమయ్య జిల్లా: రాయచోటిలో మాజీ ఎంపీపీ గౌస్ మహ్మద్ రఫీ కుటుంబ సభ్యుల వివాహా వేడుకకు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. రాయచోటిలోని రాజధాని ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని వరుడు మహ్మద్ నిహాజ్, వధువు నూర్ ఈ చష్మిలను ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆశీర్వదించారు. సీఎం వైయస్ జగన్ వెంట డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు ఉన్నారు.

# వారికి ఓటేస్తే మోదీకి వేసినట్టే.. మన చెప్పుతో మనం కొట్టుకున్నట్టే



అనంతపురం : ఏపీ ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం అమ్మేస్తోందని ఏపీసీసీ నేత తులసి రెడ్డి పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ఉన్న మణిపూర్‌లో పరిస్థితి ఎలా ఉందో మనం చూసుకోవచ్చన్నారు. రాయలసీమకు పంగనామాలు, రైల్వే జోన్, పోలవరం లేదన్నారు. ఆఖరికి కృష్ణా జలాల పంపిణీలో కూడా మనకు అన్యాయం జరిగిందని తులసిరెడ్డి పేర్కొన్నారు. ఇక చివరకు మనకు తాగునీరుకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రాంతీయ పార్టీ అధినేతలు ముగ్గురూ రాష్ట్రానికి ద్రోహం చేస్తుంటే భజనలు చేస్తున్నారని తులసిరెడ్డి విమర్శించారు. కీలుబొమ్మ పార్టీలతో రాష్ట్రానికి ఏం మేలు జరుగుతుందని ప్రశ్నించారు. కరువు ఇంతలా వచ్చి ఉంటే వైసీపీ నేతలు ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఓటేసినా.. వైసీపీ అధినేత జగన్‌కు.. అలాగే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఓటేసినా.. మోదీకి ఓటేసినట్టేనని పేర్కొన్నారు. వీరికి ఓటేస్తే మన చెప్పుతో మనం కొట్టుకున్నట్టేనని తులసిరెడ్డి పేర్కొన్నారు.



## మోదీ దార్శనిక నాయకుడు..

# దేశానికి నరేంద్ర మోదీ అవసరం: ట్విట్టర్‌లో పవన్

అమరావతి: భారత దేశానికి నరేంద్ర మోదీ అవసరం అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేశారు.

ఇంకా ఏమన్నారంటే.. "మోదీ మన దేశానికి కీలకమైన ఒక దార్శనిక నాయకుడు.. ఆయన ఎన్నో సవాళ్లను అధిగమించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్న నేత.. బలమైన దృక్పథాన్ని వ్యక్తీకరించడం, ఐక్యతను పెంపొందించడం.. వివిధ రంగాలలో పరివర్తనాత్మక మార్పును నడిపించడం ద్వారా దేశాన్ని మంచి భవిష్యత్తు వైపు నడిపించే సామర్థ్యం మోదీకి ఉంది" అని అన్నారు. దీర్ఘకాలిక అభివృద్ధి, భవిష్యత్తు తరాల శ్రేయస్సుపై ఆలోచన చేస్తారని కొనియాడారు. తన 'విజన్ 2047'ని సాకారం చేయడానికి... జనసేన పార్టీ బీజేపీకి, నరేంద్రమోదీకి మద్దతు ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# వైకుంఠద్వార దర్శన టికెట్ల కోటా నేడు

తిరుమల : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి వైకుంఠద్వార దర్శన టికెట్ల కోటాను టీటీడీ శుక్రవారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. డిసెంబరు 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు పదిరోజుల పాటు వైకుంఠద్వార దర్శనాలుంటాయి. ఈ క్రమంలో రోజుకు 25 వేల చొప్పున పదిరోజులకు సంబంధించిన 2.25 లక్షల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను, రోజుకు 2 వేల చొప్పున శ్రీవాణి ట్రస్టు దాతల టికెట్లను టీటీడీ శుక్రవారం విడుదల చేయనుంది.

ఉదయం 10 గంటలకు రూ.300 దర్శన టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవా ణి ట్రస్టు దాతల టికెట్లను విడుదల చేయనున్నారు. అలాగే సాయం త్రం 5 గంటలకు ఈ పదిరోజులకు సంబంధించిన గదుల కోటాను కూడా విడుదల చేస్తారు.

# ప్రశ్నించిన వారికి విజయసాయిరెడ్డి కులాలు అంటగడుతున్నారు



అమరావతి: ప్రశ్నించిన వారికి కులాలు, కుటిల రాజకీయాలు అంటగట్టే అలవాటు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఉందని మాజీ మంత్రి, టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం నాడు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.." ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రశ్నలకు విజయసాయిరెడ్డి సమాధానం చెప్పలేక ఆమెపై వ్యక్తిగత ధూషణలకు దిగజారాడు.విజయసాయిరెడ్డి అవినీతి, నేరాలు చర్చనీయాంశాల య్యాయి. తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పలేని దుస్థితికి విజయసాయిరెడ్డి దిగజారాడు. కేసుల మాఫీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టడం, సిద్ధాంతాలు, నీతి నియమాలు గాలికొదిలేసి అడ్డదారులు తొక్కడం వైసీపీ నేతల సంస్కృతి అయింది. త్వరలో మూసేసే వైసీపీ కార్యాలయం ముందు 'టులెట్' బోర్డు పట్టుకోవడానికి విజయసాయిరెడ్డి సిద్ధంగా ఉండాలి. ఇసుక, మద్యం, గనులు వంటి అనేక వ్యవహారాల్లో వైసీపీ పెద్దల అవినీతి, అక్రమాలను సాక్ష్యాధారాలతో ఎండగడుతున్నారని పురందేశ్వరిపై వైసీపీ నేతలు పోటీపడి విషం చిమ్ముతున్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకోవడం, ప్రకృతి వనరులను మింగేయడం ఒకే కులానికి అన్ని పదవులు కట్టబెడుతూ, బడుగు బలహీనవర్గాలను వంచించడమే అజెండాగా సాగుతున్న జగన్‌రెడ్డి అరాచక పాలనను ప్రశ్నించడం నేరమా..? నోరెత్తిన వారిపై కేసులు పెట్టడం, దుష్ప్రచారం చేయడం మీ నైజం కాదా"..? అని అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఉమ్మడి మేనిఫెస్టో రూపకల్పనే ఎజెండా

# ఉమ్మడి మేనిఫెస్టోనే ఎజెండా.. తెదేపా-జనసేన రెండో సమావేశం

అమరావతి: ఉమ్మడిగా పూర్తిస్థాయి మేనిఫెస్టో రూపకల్పనే ప్రధాన ఎజెండాగా విజయవాడలో తెదేపా-జనసేన సమన్వయ కమిటీ రెండో సమావేశం ప్రారంభమైంది. మేనిఫెస్టో ప్రకటన లోపు ఉమ్మడి కార్యాచరణ దిశగా ప్రజల్లోకి ఐక్యంగా వెళ్లేందుకు ఓ కరపత్రం రూపొందించే అంశంపైనా నేతలు చర్చిస్తున్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటానికి 100 రోజుల ప్రణాళికను ఈ భేటీలో ఇరు పార్టీలు సిద్ధం చేసుకోనున్నాయి. ఓటర్ జాబితా అవకతవకలపైనా ఉమ్మడి పోరు ప్రణాళికను తెదేపా జనసేనలు ప్రకటించనున్నాయి. ఇప్పటికే ఇరుపార్టీలు ఉమ్మడి జిల్లాల స్థాయిలో ఆత్మీయ సమావేశాల్ని పూర్తి చేసుకునందున్న, రానున్న రోజుల్లో నియోజకవర్గాల స్థాయిలోనూ ఆత్మీయ సమావేశాల నిర్వహణపై నేటి భేటీలో నిర్ణయం తీసుకోనున్నారు. తాజా సమావేశానికి తెలుగుదేశం నుంచి నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, తంగిరాల సౌమ్య హాజరవగా.. జనసేన నుంచి నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, పాలవలస యశస్వి, బొమ్మిడి నాయికర్, మహేందర్‌రెడ్డి, కొటికలపూడి గోవిందరావులు హాజరయ్యారు. అక్టోబర్ 23న రాజమహేంద్రవరంలో ఇరు పార్టీల తొలి సమావేశం జరగ్గా.. దానికి కొనసాగింపుగా నేడు రెండో సమావేశం కొనసాగింది.

# 10 కోట్ల మంది నకిలీ లబ్ధిదారులను ఏరివేశాం : మోదీ



భోపాల్: దేశవ్యాప్తంగా పేదల కోసం తమ ప్రభుత్వం నాలుగు కోట్ల ఇళ్లు కట్టించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అయినప్పటికీ తనకు మాత్రం సొంతిల్లు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఎక్కడ చూసినా అవినీతే కనిపించేదని చెప్పారు.

దాంతో పేదల ఇంటి కల చెదిరిపోయిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని సత్నాలో పర్యటించిన మోదీ.. కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 'పేదల కోసం మా ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు కోట్ల పక్కా ఇళ్లు నిర్మించింది. కానీ, నాకు మాత్రం సొంతిల్లు లేదు. మీ అమూల్యమైన ఒక్క ఓటు భాజపాకు వేస్తే.. అది రాష్ట్రంలో అధికారం నుంచి కాంగ్రెస్‌ను 100 మైళ్ల దూరం తరిమికొడుతుంది. ఎక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అక్కడ విధ్వంసమే ఉంటుంది. పేదల హక్కులను కాలరాస్తుందనడానికి నకిలీ లబ్ధిదారుల స్కాం ఇందుకు ఓ ఉదాహరణ. 10కోట్ల మంది నకిలీ లబ్ధిదారుల ముసుగులో తన అనుచరుల జేబులను కాంగ్రెస్ నింపేసింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 10కోట్ల మంది నకిలీ లబ్ధిదారులను ఏరివేశాం. తద్వారా రూ.2.75లక్షల కోట్లను ఆదా చేశాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న అంతర్గత విభేదాలను ప్రస్తావించిన మోదీ.. రాష్ట్ర కాంగ్రెస్‌ను తమ కుమారుల చేతిలో పెట్టేందుకు ఇద్దరు ముఖ్యనేతలు తలపడుతున్నారని అన్నారు. అంతకుముందు రోజు మధ్యప్రదేశ్‌లోని గునా, దమోహ్, మురేనా ప్రాంతాల్లో పర్యటించిన ప్రధాని మోదీ.. కాంగ్రెస్ పాలనపై మండిపడ్డారు. జాతీయ భద్రతతోనూ కాంగ్రెస్ ఆటలాడేదని.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా రక్షణ రంగంలో ఆ పార్టీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. ఇదిలాఉంటే, మధ్యప్రదేశ్‌లో అన్ని అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 17న పోలింగ్ జరగనుంది.



## నేను భారత మహిళను అయ్యుంటే..!

# నేను భారత మహిళను అయ్యుంటే..?: నీతీశ్ వ్యాఖ్యలపై అమెరికన్ సింగర్ ఫైర్

వాషింగ్టన్: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ 'జనాభా నియంత్రణ'వ్యాఖ్యలపై ప్రముఖ అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ స్పందించారు. ఆయన మాటలను ఖండించారు. అలాగే ప్రధాని మోదీ పాలనను ప్రశంసించారు. ఇటీవల బిహార్‌లో నిర్వహించిన కులగణనకు సంబంధించిన నివేదికను రెండురోజుల క్రితం అసెంబ్లీలో ప్రవేశపెట్టే సందర్భంగా నీతీశ్ మాట్లాడుతూ.. 'చదువుకున్న మహిళకు భర్తను ఎలా నియంత్రించాలో తెలుసు' అని కొంత అభ్యంతరకర భాషలో మాట్లాడారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఏకంగా ప్రధాని మోదీ కూడా ఈ వ్యాఖ్యలను ఖండించారు. తాజాగా వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ.. మిల్బెన్ సుదీర్ఘ పోస్టు పెట్టారు. 'భారత సోదరసోదరీమణులకు నమస్కారం. ప్రపంచవ్యాప్తంగా మరీ ముఖ్యంగా అమెరికా, భారత్‌లో 2024 ఎన్నికల సీజన్ మొదలైంది. కాలం చెల్లిన ఆలోచనలకు ముగింపు పలికి ప్రగతిశీల ఆలోచనలను భర్తీ చేసే అవకాశాన్ని ఈ ఎన్నికలు కల్పిస్తాయి. భారత ప్రధాని నరేంద్రమోదీకి ఎందుకు మద్దతు ఇస్తావని, భారత వ్యవహారాలపై ఎందుకంత ఆసక్తి చూపుతావని చాలా మంది నన్ను ప్రశ్నిస్తుంటారు. ఎందుకంటే.. నాకు భారత్ అంటే ప్రేమ. అమెరికా– భారత్ బంధానికి, అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వానికి మోదీ నాయకత్వం సరైనది' అని మోదీ నాయకత్వాన్ని కొనియాడారు. 'ప్రస్తుతం ఇండియా ఒక కీలకమైన సమయాన్ని ఎదుర్కొంటోంది. బిహార్‌లో మహిళలకు విలువనివ్వడమనేది సవాలుగా మారింది. దీనికి ఒకటే సమాధానం ఉందని నా నమ్మకం.


నీతీశ్‌జీ వ్యాఖ్యల తర్వాత.. బిహార్ ముఖ్యమంత్రి పదవి కోసం ఒక ధైర్యవంతురాలైన మహిళ ముందుకు రావాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను. నేను భారతీయ మహిళను అయ్యుంటే.. బిహార్‌కి వెళ్లి ముఖ్యమంత్రి పదవికి పోటీ చేసుండేదాన్ని. నీతీశ్ కుమార్ రాజీనామా చేయాల్సిన సమయం వచ్చిందనుకుంటున్నాను. 'జవాన్' సినిమాలో ఎస్‌ఆర్‌కే(షారుక్ ఖాన్) 'ఓటు వేయండి, మార్పు తీసుకురండి' అని సూచించారు. బిహార్ ప్రజలకు నేను కూడా ఇదే సూచిస్తున్నాను' అని మిల్బెన్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రఖ్యాత అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ కు కొత్తగా పరిచయం అవసరం లేదు. కొద్దినెలల క్రితం అమెరికాలో ప్రధాని మోదీ అధికారిక పర్యటన ముగింపు కార్యక్రమంలో మేరీ మిల్బెన్ భారత జాతీయ గీతం 'జనగణమన' ఆలపించారు. అనంతరం ప్రధాని పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నారు.

# 65శాతం రిజర్వేషన్లకు బిహార్ అసెంబ్లీ ఆమోదం

పట్నా: విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లను ప్రస్తుతమున్న 50 శాతం నుంచి 65 శాతానికి పెంచుతూ బిహార్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు.. రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది. ఈ రిజిస్ట్రేషన్ సవరణ బిల్లును గురువారం శాసనసభలో ప్రవేశపెట్టగా.. సభ్యులు దీనికి ఆమోదం తెలిపారు. జనాభా నియంత్రణపై రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శాసనసభలో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. వారి నిరసనల మధ్యే ఈ బిల్లును ప్రవేశపెట్టి మూజువాణి ఓటింగ్ చేపట్టారు. రిజర్వేషన్ల పెంపునకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. గవర్నర్ సంతకం తర్వాత ఈ బిల్లు చట్టంగా మారనుంది. ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన కులగణనకు సంబంధించిన నివేదికను నీతీశ్ సర్కారు గత మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా సీఎం నీతీశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. తాజా బిల్లుతో ఎస్సీలు, ఎస్టీలు, ఇతర వెనుకబడిన వర్గాలు, అణగారిన వర్గాల రిజర్వేషన్లు 50 శాతం నుంచి 65 శాతానికి పెరిగాయి. ఇక, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉద్దేశించిన 10 శాతం రిజర్వేషన్లు కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి పెరగనున్నాయి. కొత్త బిల్లు ప్రకారం ఎస్సీలకు రిజర్వేషన్ 16శాతం నుంచి 20శాతానికి పెరగనుంది. ప్రస్తుతం ఓబీసీ, ఈబీసీలు కలిపి 30శాతం ఉండగా.. తాజా పెంపుతో అవి 43శాతం కానున్నాయి. మరోవైపు ఎస్టీలకు 2శాతాన్ని ప్రతిపాదించారు.

# విజయవాడలో నాలాలో పడి బాలుడి మృతి



విజయవాడ వన్‌టౌన్: విజయవాడ నగరపాలక సంస్థలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. నాలాలపై మెష్‌లు ఏర్పాటు చేయని కారణంగా ఓ బాలుడు ప్రమాదవశాత్తు అందులోని పడి మృతి చెందాడు. విజయవాడ 56వ డివిజన్ పాత రాజరాజేశ్వరి పేటలో ఈ ఘటన జరిగింది. అష్రఫ్ (5) అనే బాలుడు బుధవారం ఆడుకుంటూ ఇంటిపక్కనే ఉన్న పెద్ద నాలాలో పడి మృతి చెందారు. ఈ విషయం తెలియని తల్లిదండ్రులు బాలుడి ఆచూకీ కోసం తీవ్రంగా వెతికారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి ఇంటి ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు పరిశీలించగా పోలీసులకు ఎక్కడా ఆచూకీ కనిపించలేదు. దీంతో ఇంటిపక్కన ఉన్న నాలాలోనే పడి ఉంటాడనే అనుమానంతో చుట్టపక్కల ఇవాళ వెతికారు. ఇంటికి కొద్దిదూరంలో నాలాలో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# సూపర్ స్టైలింగ్ మెగా ప్రిన్సెస్

మెగా బ్రదర్ నాగబాబు కూతురు నిహారిక మల్టీ ట్యాలెంటెడ్ అని ఇప్పటికే నిరూపితం అయింది. చిన్న వయసులోనే బుల్లి తెర యాంకర్ గా చేసిన నిహారిక ఆ తర్వాత పలు కార్యక్రమాల్లో సందడి చేసింది. చాలా మంది వద్దంటున్నా కూడా నిహారిక ఫ్యామిలీ మద్దతుతో హీరోయిన్ గా కూడా చేసింది. రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్ గా నిహారిక కి గుర్తింపు రాలేదు. నిహారిక కొన్ని సినిమాల తర్వాత పెళ్లి చేసుకుని ఇండస్ట్రీ కి దూరం అయింది. అయితే ఇటీవల భర్త నుంచి



విడిపోవడం వల్ల నిహారిక మళ్లీ ఇండస్ట్రీలో అడుగు పెట్టే అవకాశాలు ఉన్నాయి ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అది నిజమే అన్నట్లుగా ఆమె ఒక వెబ్ సిరీస్ లో నటించింది. ఆ వెబ్ సిరీస్ తో నిహారిక కి పెద్దగా మైలేజ్ రాలేదు. ఈ మధ్య కాలంలో నిహారిక వరుసగా హాట్ ఫోటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. గతంతో పోల్చితే కాస్త గ్లామర్ డోస్ పెంచినట్టు అనిపిస్తుంది. ఇదే సమయంలో ఆమె సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చే విధంగా కూడా చర్చలు జరుగుతున్నాయి అన్నట్లుగా టాక్ వినిపిస్తోంది. ఇటీవల తన అన్న వరుణ్ తేజ్ పెళ్లి లో సందడి చేసిన నిహారిక ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి వైరల్ అయింది. తాజాగా మరోసారి హాట్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అయింది. నడుము అందం చూపిస్తూ సూపర్ స్మైలింగ్ తో నెటిజన్స్ ను కవ్విస్తోంది. త్వరలో నిహారిక కమర్షియల్ హీరోయిన్ గా టర్న్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి అన్నట్టుగా చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## పుష్ప 2- యానిమల్ తర్వాత రష్మిక మరో జాక్ పాట్

కెరీర్ ప్రారంభించిన ఐదేళ్లలోనే అగ్ర కథానాయికగా ఎదిగేసిన రష్మిక మందన్న నేషనల్ క్రష్ గా భారీ ఫాలోయింగ్ ని ఆస్వాధిస్తోంది. పుష్ప చిత్రంతో పాన్ ఇండియా కథానాయికగా ఓ వెలుగు వెలిగిన ఈ బ్యూటీ తదుపరి పుష్ప 2- యానిమల్ (రణబీర్ హీరో)లాంటి భారీ సినిమాల్లో నటిస్తోంది. ఈ రెండు సినిమాలతో తన స్టార్ డమ్ మరో స్థాయికి రైజ్ అవుతుందని రష్మిక నమ్మకంగా ఉంది. ఇంతలోనే రష్మికను మరో జాక్ పాట్ వరించింది. చియాన్ విక్రమ్- విజయ్ సేతుపతి లాంటి పవర్ హౌస్ హీరోలతో భారీ మల్టీస్టారర్ లో రష్మిక నటించనుందని తెలుస్తోంది. మలయాళ దర్శకుడు 2018 ఫేం జూడ్ ఆంథోని ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. జూడ్ ఇప్పటికే మలయాళంలో వరస బ్లాక్ బస్టర్లతో దూకుడుమీదున్నారు. ఇప్పుడు చియాన్ విక్రమ్- సేతుపతి లాంటి



జాతీయ అవార్డ్ గ్రహీతలతో కలసి పని చేయనున్నాడు. నిజానికి ఇద్దరు టాప్ హీరోలతో పాన్ ఇండియా హీరోయిన్ గా రష్మిక ఎంపిక బిజినెస్ పరంగా ఎంతో హైప్ ని పెంచుతుందనడంలో సందేహం లేదు. జూడ్ ప్రాజెక్ట్ కి రష్మిక మందన ప్రధాన అస్సెట్ కానుంది. అయితే తాజా నివేదికల ప్రకారం, ఈ ప్రాజెక్ట్ కోసం రష్మిక -విజయ్ సేతుపతి పేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఇద్దరు తారలతో చర్చలు జరుగుతున్నాయి. అన్నీ ఓకే అయితే అధికారికంగా ప్రాజెక్టును ప్రకటిస్తారు. దీనిని లైకా ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మించనుంది. జూడ్ ఆంథనీ జోసెఫ్ 2014లో 'ఓం శాంతి ఓషానా' పెద్ద విజయం సాధించింది. నజ్రియా నజీమ్, నివిన్ పౌలీ, వినీత్ శ్రీనివాసన్ వంటి ప్రతిభావంతులైన స్టార్లతో ఈ సినిమాని తెరకెక్కించారు జూడ్. 2018 రూపొందించడానికి ముందు మొత్తం మూడు చిత్రాలకు జూడ్ దర్శకత్వం వహించాడు. 2018 చిత్రం భారీ కమర్షియల్ విజయాన్ని అందుకుని మలయాళ సినిమా చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా అవతరించింది. కేరళ వరదల ఆధారంగా రూపొందించిన 2018 సహజసిద్ధంగా తెరకెక్కిన సంగతి తెలిసిందే.




# రాధ కుమార్తె కార్తీక పెళ్లి.. దర్శకేంద్రుడికి ఆహ్వానం?






90లలో గ్లామరస్ కథానాయికగా ఏలిన రాధ టాలీవుడ్ కోలీవుడ్ లో అగ్రహీరోల సరసన నటించిన సంగతి తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ వంటి స్టార్లకు హిట్ పెయిర్ గా పాపులరయ్యారు. ఆ తర్వాత రాధ ప్రముఖ బిజినెస్ మేన్ ని పెళ్లాడి దుబాయ్ లో సెటిలైన సంగతి తెలిసిందే. రాధకుమార్తెలు కార్తీక నాయిర్, తులసి నాయిర్ కూడా కథానాయికలు అయ్యారు. కానీ ఇద్దరి కెరీర్ ఆశించిన స్థాయికి ఎదగలేదు. అనంతరం తమ వ్యాపారాల్లో కార్తీక నాయిర్ కూడా బిజీ అయ్యారు. ఇటీవలే కార్తీక నాయర్ నిశ్చితార్థం ఎటువంటి హంగామా లేకుండా జరిగింది. కార్తీక స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో దాని గురించి హింట్ ఇచ్చారు. కాబోయేవాడితో కలిసి ఉన్న ఓ ఫోటోని షేర్ చేసారు. అయితే ఈ ఫోటోలో తన హబ్బీ ఎవరు? అన్నది అంత స్పష్టంగా లేదు. కార్తీక కాబోయే వ్యక్తిని ఆలింగనం చేసుకుని ఆనందంగా కనిపిచింది. ఈ ఫోటోలో నిశ్చితార్థపు ఉంగరం కనిపించింది. అయితే కార్తీక ప్రియుడి గురించి ఎటువంటి సమాచారం ఇప్పటివరకూ అందుబాటులో లేదు. కార్తీక పెళ్లి తేదీ లాక్ అయిందని సమాచారం. ప్రస్తుతం పెళ్లి పనులు జరుగుతున్నాయి. ఈ పెళ్లికి పలువురు టాలీవుడ్ ప్రముఖులకు శుభలేఖలు అందనున్నాయని కూడా టాక్ వినిపిస్తోంది. తాజాగా దర్శకేంద్రుడు కే.రాఘవేంద్రరావును రాధ కలిసారు. దీంతో కుమార్తె పెళ్లికి ఆహ్వానించేందుకు రాధ హైదరాబాద్ కి వచ్చారని అర్థమవుతోంది. అందుకు సంబంధించిన ఓ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అయితే కార్తీక పెళ్లి ఎప్పుడు? ఎవరెవరికి ఆహ్వానాలు అందాయి? అన్నదానిపై ఎలాంటి సమాచారం లేదు. కుమార్తె పెళ్లి గురించి రాధ స్వయంగా వెల్లడిస్తారేమో చూడాలి.

**కార్తీక కెరీర్ జర్నీ ఇలా..** రాధ కుమార్తె కార్తీక నాయర్ 2009లో తెలుగు చిత్రం 'జోష్'తో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించింది. ఇదే చిత్రంతో నాగ చైతన్య కథానాయకుడిగా పరిచయమయ్యారు. కానీ ఆ సినిమా ఆశించిన విజయం సాధించలేదు. ఆ తర్వాత తమిళ హీరో జీవా - పియా బాజ్‌పాయ్‌లతో కలిసి రెండవ చిత్రం 'రంగం'తో పెద్ద విజయం అందుకుంది. ఈ చిత్రం తమిళంలో 'కో' పేరుతో విడుదలై పెద్ద విజయం సాధించింది. ఆ తర్వాత మలయాళ చిత్రం 'ప్రొప్రైటర్స్: కమ్మత్ %ഒ% కమ్మత్'లోను నటించింది. ఆ చిత్రంలో దిలీప్ సరసన కార్తీక నటించింది. కామెడీ చిత్రం బ్రదర్ ఆఫ్ బొమ్మాళి- సామాజిక నేపథ్య డ్రామా పురంపోక్కు ఎంగిర పొదువుదమై అనే చిత్రాల్లో నటించింది. ఎపిక్ హిందీ టీవీ సిరీస్ 'ఆరంభ్'లో యాక్షన్-ప్యాక్డ్ పెర్ఫార్మెన్స్ తో కార్తీక ఆకట్టుకుంది.

# శ్రీలీల లుంగీ పవర్.. మహేష్ ను డామినేట్ చేస్తుందా?





సూపర్ స్టార్ మహేష్ బాబు త్రివిక్రమ్ దర్శకత్వంలో చేస్తున్న గుంటూరు కారం సినిమా మళ్లీ పాజిటివ్ వైబ్రేషన్స్ తో మంచి హైప్ క్రియేట్ చేసుకుంటుంది. మొదట ఈ సినిమాపై వచ్చిన నెగిటివ్ గాసిప్స్ వలన అసలు సినిమా ఎలాంటి ఫలితం అందుకుంటుందో అనేలా అనుమానాలు కూడా వచ్చాయి. సినిమా షూటింగ్ నుంచి టెక్నీషియన్ లో మార్పులు జరిగే వరకు అన్నీ కూడా ఫాన్స్ లో కాస్త కంగారును కలిగించాయి. కానీ త్రివిక్రమ్ ఆ తరువాత ఎలాంటి పొరపాట్లు లేకుండా పక్కా ప్రణాళికతో వస్తున్నట్లుగా అర్థమవుతుంది. గుంటూరు కారం సినిమా మాస్ కమర్షియల్ ఎలిమెంట్స్ తో గట్టిగానే ఉండబోతున్నట్లు అర్థమవుతుంది. ఇక మొదటి సాంగ్ కూడా ఓ వర్గం ఆడియన్స్ ని బాగానే ఆకట్టుకుంటుంది. థమన్ ఉన్న బజ్ పోగొడతాడు అనుకున్నా వారికి ఊహించని విధంగా కౌంటర్ అయితే ఇచ్చాడు. ఇక ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరొక పాట కూడా సినిమాలో హైలెట్ కాబోతున్నట్లు టాక్. అది మాస్ ఆడియోన్స్ చేత విజిల్స్ వేయించే విధంగా ఉంటుందట. ఇక ఆ పాటలో శ్రీలీల మహేష్ ను డామినేట్ చేస్తుందా అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. మహేష్ శ్రీలీల ఇద్దరు కూడా లుంగీ డ్యాన్స్ లో తీన్ మార్ స్టెప్పులు పోటాపోటీగా వేస్తారట. ఇక మహేష్ ఇప్పటికే సరిలేరు నీకెవ్వరు, సర్కారు వారి పాట.. సినిమాల్లో.. అద్భుతమైన మాస్ సాంగ్స్ తో మెప్పించాడు. ఇక ఇప్పుడు గుంటూరు కారం లో త్రివిక్రమ్ టచ్ లో కొత్త తరహా లుంగీ డ్యాన్స్ ఉంటుందట. శ్రీ లీల కూడా మాస్ స్టెప్పులు వేయనున్నట్లు తెలుస్తోంది. ఈ బ్యూటీ తన డాన్స్ తో ఎలా మెప్పిస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక గుంటూరు కారం లో మహేష్ బాబు కూడా ఆమెతో స్టెప్పులు వేస్తే మంచి కిక్ ఉంటుంది అని చెప్పవచ్చు. అయితే ఈ క్రమంలో మహేష్ బాబు కూడా ఆమెతో పోటీపడి చేయాల్సిన అవసరం ఉంటుంది. బాబుకు మంచి క్రేజ్ ఉన్నప్పటికీ ఇప్పుడు శ్రీలీల టైం కూడా గట్టిగానే నడుస్తుంది. ఆమె అందానికి పదునైన డాన్స్ స్టెప్పులు కూడా తోడైతే కచ్చితంగా పోటీ ఇస్తుంది. మరి పోటీలో ఎవరు ఎంతవరకు మెరుస్తారో చూడాలి.

# హీరోయిన్ గా ఎలాంటి కలలు లేని హీరోయిన్!

ఇండస్ట్రీకొచ్చిన ఏ నటికైనా ఓ డ్రీమ్ రోల్ అంటూ ఉంటుంది. సినిమాల నుంచి నిష్క్రమించే లోపు పలానా నటి లాంటి రోల్ లో నటించాలని చాలా మంది హీరోయిన్లు చెబుతుంటారు. ఆ ప్రభావంతోనే చాలా మంది రంగుల ప్రపంచం వైపు అడుగులు వేస్తారు. మోడలింగ్...యాక్టింగ్..బ్రాండింగ్ వెనుక ఆ రోల్ పరోక్షంగా ఎంతో బలంగా ముందుకు తీసుకెళ్తుంది. ఎంత పెద్ద హీరోయిన్ అయినా కొన్నిసార్లు అలాంటి పాత్ర రావడం ఆలస్యమైతే? నిర్మోహమాటంగా అలాంటి పాత్రలో నటించాలని ఓపెన్ గాచెబుతుంటారు. కంగనా రనౌత్ ఇటీవల చంద్రముఖి-2 లో చంద్రముఖి పాత్రని పట్టుబట్టి మరీ చేసింది. దర్శక-నిర్మాతలకి ఫోన్ చేసి ఆ పాత్రలో తానే నటిస్తానని అడిగి మరీ చేసింది. ఆ స్థాయికి చేరుకున్న తర్వాత కొన్ని రకాల డ్రీమ్స్ ని ఫుల్ ఫిల్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఫెయిల్యూర్ లో



ఉన్న నాయిక సైతం డ్రీమ్ రోల్ గురించి చెబుతుంటుంది. కానీ అను ఇమ్మాన్యుయేల్ కి మాత్రం ఎలాంటి డ్రీమ్ రోల్స్ లేవని ఆమె మాటల్ని బట్టి తెలుస్తుంది. కేవలం ప్రేక్షకులు ఇష్టపడే పాత్రలు చేయాలని ఉంది తప్ప! వ్యక్తిగతంగా తాను ఎలాంటి పాత్రలపై ఆశలు లేనట్లు చెప్పుకొచ్చింది. కేవలం మంచి కథలు..మంచి పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తే చాలు అంతకు మించి నటికి అవసరం ఏముంటుంది? అంటోంది. ప్రస్తుతం అనుఇమ్మాన్యుయేల్ కేవలం జపాన్ అనే సినిమాలోనే నటిస్తోంది. ఆశలన్నీ ఈసినిమాపైనే. తెలుగులో అమ్మడికి అవకాశాలు రాలేదు. కోలీవుడ్ లో కూడా ఈ మధ్య రాకరాక వచ్చిన అవకాశం ఇది. ఈ సినిమా హిట్ అయితే మరో సినిమాలో ఛాన్స్ అందుకునే అవకాశం ఉంది. అమ్మడు తెలుగులో మంచి అవకాశాలు అందుకుంది గానీ... వైఫల్యాలు బిజీ నాయికగా మార్చలేకపోయాయి. కాలక్రమంలో పూర్తిగా అవకాశాలే లేకుండాపో యాయి. దీంతో లాభం లేదనుకున్న అను కోలీవుడ్ కి వెళ్లిపోయింది. ఆ ప్రయత్నంలోనే జపాన్ లో ఛాన్స్ అందుకుంది.

## రెచ్చగొట్టే విధంగా అందాల 'ఖుషి'

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హిందీలో పలు సినిమాల్లో సిరీస్ ల్లో నటించిన జాన్వీ సక్సెస్ దక్కించుకోకున్నా కూడా తన హాట్ ఫోటోలతో పాపులారిటీని సొంతం చేసుకుంది. ఆ పాపులారిటీ వల్లే ఎన్టీఆర్ కు జోడీగా దేవర సినిమాలో నటించే అవకాశం ను దక్కించుకున్న విషయం తెల్సిందే. అక్క దారిలోనే ఖుషి కపూర్ కూడా అందాల ఆరబోత చేయడం మొదలు పెట్టింది. ఇండస్ట్రీలో చాలా కాలంగా ఉంటున్న ఖుషి కపూర్ ఈ మధ్య కాలంలో హీరోయిన్ గా మెల్ల మెల్లగా అడుగులు వేసే ప్రయత్నాలు చేస్తోంది. అందుకు గాను ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ తో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని



ఆకర్షిస్తున్నాయి. క్లోజప్ లో క్లీ వేజ్ షో తో మతి పోగొడుతున్న ఈ అమ్మడి అందాల ఆరబోతకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.

ఈ రేంజ్ లో అందాల ఆరబోత తో అక్క జాన్వీ కపూర్ కి తక్కువేం కాదు అన్నట్లుగా చెప్పేందుకు ప్రయత్నాలు చేస్తుంది అనిపిస్తుంది. అతిలోక సుందరి నట వారసురాలిగా ఖుషి కపూర్ కి మంచి ఫాలోయింగ్ ఉంది. ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ ను షేర్ చేయడం ద్వారా బాలీవుడ్ తో పాటు సౌత్ లో ముఖ్యంగా టాలీవుడ్ లో వరుస ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు లేకపోలేదు అన్నట్లుగా మీడియా సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది.




కామారెడ్డి: కామారెడ్డి గడ్డతో తనకు పుట్టినప్పటి నుంచి ఎంతో అనుబంధం ఉందని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. కోనాపూర్‌గా పిలుస్తున్న పోసానిపల్లిలో తన తల్లి జన్మించారని చెప్పారు. గురువారం కామారెడ్డిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. “తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తొలి రోజుల్లో కామారెడ్డికి చెందిన న్యాయవాదులు చైతన్యం చూపించారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని తెలంగాణ సాధించుకున్నాం. కామారెడ్డిని జిల్లా చేస్తానని చెప్పా.. అలాగే చేసుకున్నాం. మెడికల్ కాలేజీ కూడా తెచ్చుకున్నాం. జలసాధన ఉద్యమం 45 రోజులు చేశాం. ఆ ఉద్యమంలో బ్రిగేడియర్లను నియమించుకున్నాం. కామారెడ్డి బ్రిగేడియర్‌గా నేనే ఉన్నాను. అది నా అదృష్టంగా భావిస్తున్నా. కామారెడ్డి నుంచి పోటీ చేయాలని గోవర్ధన్ నన్ను చాలా సార్లు అడిగారు. ఇక్కడి నుంచి పోటీ చేయడం దైవకృపగా భావిస్తున్నా. కేసీఆర్ వస్తే ఒక్కడే రారు కదా.. కేసీఆర్‌తో పాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు నీరు అందిస్తాం. ఇది నా మాట. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టును పూర్తి చేస్తాం. కామారెడ్డి పట్టణంతో పాటు పల్లెల రూపురేఖలు కూడా మార్చేస్తాం. అద్భుతమైన నియోజకవర్గంగా కామారెడ్డిని అభివృద్ధి చేస్తాం” అని కేసీఆర్ హామీ ఇచ్చారు. “దేశ రాజకీయాలు, ప్రజాస్వామ్యంలో రావాల్సిన పరిణతి ఇప్పటికీ రాలేదు. ఏ దేశాల్లో ఆ పరిణతి వచ్చిందో.. ఆ దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. మనం మాత్రం ఉన్నదగ్గరే ఉన్నాం. ఎన్నికలు వస్తాయి.. పోతాయి. ప్రతి పార్టీ నుంచి ఒక అభ్యర్థి పోటీలో ఉంటాడు. అభ్యర్థుల గుణంతో పాటు అతని వెనుక ఉన్న పార్టీ ఎలాంటిదనేది కూడా ప్రజలు ఆలోచించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న ఒకే ఒక ఆయుధం.. ఓటు. ఈ ఓటు ఐదేళ్ల భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. పార్టీల నడవడి, వాళ్లకు అధికారం ఇస్తే ఏం చేశారు.. ఇలా అనేక అంశాలపై ప్రజలు ఆలోచన చేయాలి. ఆ చర్చ జరిగిన తర్వాత ఓటు వేస్తే.. అప్పుడు ఎన్నికల్లో నాయకులు కాదు.. ప్రజలు గెలవడం మొదలవుతుంది. ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికల్లో ప్రజలు గెలిచే పరిస్థితి రావాలి” అని సీఎం కేసీఆర్ అన్నారు.




హైదరాబాద్: కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఐటీ దాడులు దేనికి సంకేతమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నేడు పొంగులేటి, నిన్న తుమ్మల, అంతకుముందు పలువురు కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఐటీ దాడులు జరుగుతున్నాయన్నారు. భాజపా, భారాస నేతల ఇళ్లపై ఐటీ దాడులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు రేవంత్ ట్వీట్ చేశారు. “రాష్ట్రంలో కాంగ్రెస్ సునామీ రాబోతోందని స్పష్టమైన సమాచారం రావడంతో మోదీ – కేడీ బెంబేలెత్తుతున్నారు. ఆ సునామీని ఆపడానికి చేస్తోన్న కుతంత్రం ఇది. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాను. నవంబర్ 30న కాంగ్రెస్ సునామీలో కమలం, కారు గల్లంతవడం ఖాయం” అని రేవంత్ పేర్కొన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో రేపటి (శుక్రవారం)తో నామినేషన్ల పర్వం ముగియనుంది. ఇప్పటికే అభ్యర్థులు ఆయా సెగ్మెంట్లలో పార్టీ తరపున ఏ ఫామ్, బీ ఫామ్‌లు అందజేస్తున్నారు. అయితే తాజాగా ఈసీ ఆదేశాలతో బీఫామ్ రానీ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. రేపటిలో(నవంబర్ 10)లోగా ఫామ్ – ఏ, ఫామ్ – బీ సమర్పించాలని ఈసీ ఆదేశించింది. లేదంటే స్వతంత్ర అభ్యర్థులుగా గుర్తిస్తామని ఈసీ స్పష్టం చేసింది. ఇప్పటికే ఈసీ ఆఫీస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తరపున పలువురు నాయకులు ఏ ఫామ్ సబ్మిట్ చేశారు. రేపు సాయంత్రం 3 గంటల వరకు ఫామ్ ఏ, బీలను అందజేయాలని ఇప్పటికే ఆర్వోలకు సీఈవో ఆఫీస్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. అయితే ఇప్పటికీ ఆయా పార్టీల్లో కొంతమంది అభ్యర్థులకు బీఫామ్స్ అందని పరిస్థితి. రేపటితో చివరి తేదీ కావడంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. రేపు మధ్యాహ్నం 3 గంటలలోపు ఆర్వోలకు ఫామ్ ఏ అండ్ బీ అందకపోతే వారిని ఈసీ స్వతంత్ర అభ్యర్థిగా ప్రకటించనుంది.

## పార్టీ మార్పు ప్రచారంపై అద్దంకి దయాకర్ క్లారిటీ



హైదరాబాద్: కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఆ పార్టీ నేత అద్దంకి దయాకర్ ఖండించారు. తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ తరఫున తుంగతుర్తి అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ వేయనున్నట్లు ప్రకటించారు. పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారం.. భారాసలోని కొంత మంది తనపై చేస్తున్న కుట్రలో భాగమేనని విమర్శించారు.ఆ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు అండగా ఉందని, బీ ఫాం ఇస్తుందని ధీమా చెప్పారు. తుంగతుర్తిలోని తమ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో కలిసి శుక్రవారం నామినేషన్ వేస్తానని అద్దంకి దయాకర్ చెప్పారు.

## నామినేషన్ వేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి...ఆపై మీడియాతో ఏమన్నారంటే?..

ఖమ్మం: పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. భారీ ర్యాలీగా వచ్చి పొంగులేటి నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో తుమ్మల నాగేశ్వర రావు పాల్గొన్నారు. నామినేషన్ అనంతరం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... ఈ నెల 30న జరుగుతున్న ఎన్నికలకు పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ రోజు ఉదయం ఎప్పుడు చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో తనపై, తన కుటుంబసభ్యులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీ దాడులు నిర్వహించారన్నారు. తన అనుచరులు, అభిమానులపై కూడా దాడులు చేశారని తెలిపారు. ఐటీ దాడులను తప్పు అనడం లేదని.. కానీ దానికి ఒక సమయం సందర్భం ఉంటుంది అధికారులు అది మరిచి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ రోజు తాను నామినేషన్ వేస్తున్నానని తెలిసి మరీ కావాలని దాడులు చేశారని ఆరోపించారు. ఈ రోజు తనను బయటకు పంపించమని మొండిగా కూర్చున్నారని మాజీ ఎంపీ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారని.. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆందోళన చేస్తే అధికారులు విడిచి పెట్టారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇటువంటి దాడులు చేయొచ్చా అని ఎన్నికల కమిషన్‌ను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అరచేతిని అడ్డు పెట్టి సూర్య కిరణాలు ఆపలేరని.. కాంగ్రెస్ గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను, అభిమానులను బీఆర్ఎస్ పార్టీ భయపెట్టేందుకు యత్నిస్తోందని మాజీ ఎంపీ విమర్శలు గుప్పించారు. “ఈ రోజు కొన్ని ప్రాంతాల్లో నా ఎన్నికల క్యాంపైనింగ్ ఉంది. 4 గంటల వరకు నేను బయటకు వస్తా. మీరూ ఏం పీక్కుంటారో పీక్కోండి. తెలంగాణ ప్రాంతంలో ఈ దొరల పాలనను, దొరల పాలనకు మద్దతు పలికే పార్టీలకు బుద్ధి చెప్తాం. మీరు ఎన్ని దాడులు చేస్తే అంతలా ఎదురొస్తాం. మీ ప్రవర్తన మార్చుకోకపోతే, పరిణామాలు తీవ్రంగా ఉంటాయి” అంటూ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.

## గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్.. సిరిసిల్లలో కేటీఆర్ నామినేషన్లు









భారాస అధినేత, సీఎం కేసీఆర్ రెండు చోట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం గజ్వేల్, మధ్యాహ్నం కామారెడ్డిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేశారు. గజ్వేల్‌లో సమీకృత భవనంలో రిటర్నింగ్ అధికారికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందించిన ఆయన.. కామారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ వేశారు. గజ్వేల్‌లో నామినేషన్ అనంతరం కేసీఆర్ ప్రచార వాహనం పైనుంచి ప్రజలకు అభివాదం చేశారు. మరోవైపు మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ కూడా నామినేషన్లు దాఖలు చేశారు. సిద్దిపేటలోని ఆర్డీవో కార్యాలయంలో హరీశ్‌రావు, సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో కేటీఆర్ నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. భారాస అగ్రనేతల నామినేషన్ల సందర్భంగా ఆయా చోట్ల సందడి వాతావరణం నెలకొంది.

**గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్.. సిరిసిల్లలో కేటీఆర్ నామినేషన్లు**

భారాస అధినేత, సీఎం కేసీఆర్ రెండు చోట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ కూడా నేడే నామినేషన్లు వేశారు.




ఆర్మూర్: ఆర్మూరు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రచార రథం రెయిలింగ్ విరగడంతో మంత్రి కేటీఆర్ ప్రచారం రథంపై నుంచి కిందపడ్డారు.

మంత్రి కేటీఆర్‌తోపాటు ఎంపీ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కూడా ప్రచార రథంపై నుంచి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో మంత్రికి, ఇతర నేతలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రచారం రథం నడుపుతున్న వ్యక్తి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వాహనం రెయిలింగ్ విరిగిపోయింది. దాంతో నేతలకు పట్టుదొరకక కింద పడిపోయారు. ప్రచార రథం రెయిలింగ్ విరగగానే భద్రతా సిబ్బంది పట్టుకోవడంతో నేతలకు పెను ప్రమాదం తప్పింది.

## అంబులెన్స్‌లో వచ్చి నామినేషన్ వేసిన భారాస అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: మెదక్ ఎంపీ, దుబ్బాక భారాస అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రచారంలో ఉండగా ఓ యువకుడి చేతిలో కత్తిపోటుకు గురైన ఆయనకు శస్త్రచికిత్స జరిగింది. దీంతో గత 10 రోజులుగా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో ప్రభాకర్‌రెడ్డి చికిత్స పొందుతున్నారు.

ఈ నేపథ్యంలో ఆయన ఆస్పత్రి నుంచి అంబులెన్స్‌లో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. దుబ్బాకలోని అంబులెన్స్ దిగిన తర్వాత వీల్‌చైర్‌లో రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ పత్రాలను ఆర్వో గరిమ అగర్వాల్‌కు సమర్పించారు.



## కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే రాష్ట్రం పదేళ్లు వెనుకకు పోతది: మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట: కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే రాష్ట్రం పదేళ్లు వెనుకకు పోతదని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో నామినేషన్ వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సిద్దిపేట నుంచి ఏడోసారి నామినేషన్ దాఖలు చేశానని, ఇక్కడి ప్రజలపై తనకు పూర్తి విశ్వాసం ఉన్నదని, ఈసారి కూడా మంచి మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని మంత్రి కోరారు. సిద్దిపేట ప్రజలు తనకు కుటుంబసభ్యుల లాంటి వారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఇప్పటికే తనకు ఆరుసార్లు అద్భుత విజయం అందించి సేవచేసే అవకాశం ఇచ్చారని అన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధిగా సిద్దిపేట ప్రజలు కోరుకున్న పనులేగాక ఇంకా ఎన్నో పనులు చేశానని చెప్పారు. గతంలో తెలంగాణలో కరువు కాటకాలు, ఆకలి చావులు, వలసలు ఉండేవన్నారు. ఇప్పుడు సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా మార్చారని మంత్రి చెప్పారు. రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా మార్చారని ఆయన కొనియాడారు. కాబట్టి కాంగ్రెస్, బీజేపీలకు ఓటేసి రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి పోయేలా చేయవద్దని కోరారు.

## ఇది విజయోత్సవ ర్యాలీలా ఉన్నది.. షకీల్ నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్సీ కవిత



బోధన్: దేశమంతా గులాబీ హవా నడుస్తున్నదని తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ నియోజకవర్గంలో గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ సందర్భంగా బోధన్ పట్టణంలో తీసిన ర్యాలీలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. షకీల్‌ను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రస్తుతం దేశమంతటా గులాబీ హవా నడుస్తున్నదని, రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీదే విజయమని అన్నారు. షకీల్ నామినేషన్ ర్యాలీని చూస్తుంటే విజయోత్సవ ర్యాలీలా అనిపిస్తున్నదని ఆమె అభివర్ణించారు. ఈ జోష్ షకీల్ విజయం ఖాయమని చెబుతోందని అన్నారు.

## హైదరాబాద్‌లో నామినేషన్‌ల హడావుడి.. భారీగా ట్రాఫిక్ జాం

హైదరాబాద్: తెలంగాణలో రేపటితో (నవంబర్ 10) నామినేషన్ల పర్వం ముగియనుంది. నేడు మంచి రోజు కావడంతో ఆయా పార్టీల అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు వేసేందుకు భారీ ర్యాలీలతో బయలుదేరారు. సిటీలో నామినేషన్ల హడావుడితో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. దీంతో నగరవ్యాప్తంగా ఎక్కడికక్కడ రోడ్లపై వాహనాలు నిలిచిపోతున్న పరిస్థితి. ర్యాలీలు, రోడ్ షోలతో వాహనదారులు నరకాయతన అనుభవిస్తున్నారు. కిలోమీటర్ ప్రయాణానికి గంటకు పైగా సమయం పడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కూకట్‌పల్లి నుంచి ఎర్రగడ్డ వరకు ఫుల్ ట్రాఫిక్ జామ్ అయ్యింది. అలాగే జీడిమెట్ల నుంచి బాలనగర్ వరకు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. కేబీఆర్ పార్క్ నుంచి పంజాగుట్ట మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈరోజు మంచి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు వేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com